# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 5వ అధ్యాయము - కర్మసన్న్యాసయోగము)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంథకర్తవి, ప్రచురణకర్తవి.

ప్రథమ ముద్రణ : 2007
ప్రతులు : 1,000

వెల : రూ॥ **20-00**

*ప్రాప్తిస్థానము :*
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్',
14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
ఎక్సేల్షియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 0891-2747320.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధన మనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ",** డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు. శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు,

విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. “పరహితము పరమధర్మ” మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

- ధనిష్ఠా ఫౌండేషన్

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| | ముందుమాట | ............ | 7 |
| | ముఖ్య సూత్రములు | ............ | 9 |
| 1. | కర్మ - జ్ఞానము | ............ | 13 |
| 2. | సన్న్యాసము | ............ | 16 |
| 3. | కర్మ - జ్ఞానము - సాంఖ్యము | ............ | 18 |
| 4. | సాంఖ్యము - యోగము | ............ | 22 |
| 5. | ముని - మననము - బ్రహ్మము | ............ | 24 |
| 6. | సోపానములు - యోగము | ............ | 27 |
| 7. | గమనిక; సాక్షిత్వము | ............ | 30 |
| 8. | తామరాకు - నీటి బిందువు | ............ | 33 |
| 9. | యోగి - కర్మ నిర్వహణము | ............ | 35 |
| 10. | నైష్ఠికులు | ............ | 37 |
| 11. | మానసిక సన్న్యాసము | ............ | 40 |
| 12. | సన్న్యాసము | ............ | 42 |
| 13. | తటస్థత | ............ | 44 |
| 14. | నిరహంకారము | ............ | 47 |
| 15. | అపునరావృత్తి | ............ | 50 |
| 16. | సమదర్శనము | ............ | 52 |
| 17. | సమభావము | ............ | 56 |
| 18. | బ్రహ్మజ్ఞాని | ............ | 58 |
| 19. | బ్రహ్మము | ............ | 60 |
| 20. | స్థిర చైతన్యము | ............ | 61 |
| 21. | స్మరణ | ............ | 63 |
| 22. | బ్రహ్మ నిర్వాణము | ............ | 65 |
| 23. | మోక్ష స్థితి | ............ | 67 |
| 24. | ఆత్మ నెరిగిన వారు | ............ | 69 |
| 25. | అంతర్ముఖుడు | ............ | 71 |
| 26. | మననము | ............ | 73 |
| 27. | సాన్నిధ్యము | ............ | 76 |

# ముందుమాట

**క**ర్మఫల సన్న్యాసమే కర్మసన్న్యాసముగ ఈ అధ్యాయమున పేర్కొనబడును. కర్మఫల సన్న్యాసము అనుభవమైన వారికి కర్మ చేయుట అను భావన నశించి, కర్మ జరుగుట అను అనుభూతి దైనందినముగ కలుగుచునుండును. కర్మ సన్న్యాస మనగ తమనుండి యితరుల నుండి జరుగుచున్న కర్మను సాక్షీభూతుడై గమనించుట. నదీ ప్రవాహమును నదియొడ్డున నుండి గమనించినట్లు, జరుగు చున్న కర్మను గమనించు స్థితి అభ్యాసవశమున నిష్కామ కర్మ యోగులకు కలుగును. వారికి కర్మ జరుగుచుండుట ఎక్కువగ గోచరించును. చేయుచుండుట అందులో భాగమని తెలిసి యుండును. పడవ ఒకటి ప్రవాహమున ప్రయాణము చేయు చుండగ, పడవ నడచుచున్నదని గ్రహించుట ఒక పద్ధతి. ప్రవాహమే పడవను నడిపించుచున్నదని తెలియుట మరియొక పద్ధతి. పడవ లోని ప్రయాణికుడు తాను ప్రయాణము చేయుచున్నాడని భావించుట మరియొక పద్ధతి. పడవకు ప్రయాణికునికి ప్రవాహమే ఆధారము కదా! ప్రవాహమే లేనపుడు పడవకు, ప్రయాణికునికి ప్రయాణమే లేదు. నిజమునకు సృష్టియందు జరుగుచున్న కార్యము చాల హెచ్చు. చేయుచున్న కార్యములు అతి స్వల్పము. చేయుటనుండి సృష్టి యందు జరుగుచున్న కార్యములోనికి ప్రవేశించుటయే నిష్కామ కర్మయోగము నుండి కర్మసన్న్యాస యోగములోనికి ప్రవేశించుట.

క్రొత్తగ వాహనము నడుపుట నేర్చినవాడు తానే వాహనమును నడుపుచున్నానని భావించును. కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, మనస్సు హెచ్చరికగ వాహనము నడుపుట యందు లగ్నమై యుండును. క్రమముగ నిపుణతరాగ ఆడుచు, పాడుచు, సంభాషణములు చేయుచు, గంభీరమైన విషయములను మాట్లాడుచు వాహనము నడుపుచుండును. ఇచట గమనించవలసిన విషయమొకటున్నది. బాహ్యేంద్రియములు వాహనమును యాంత్రికముగ నడుపుచుండగ, అంతఃకరణములతో జీవుడు ప్రసంగించుట, ఆడుట, పాడుట చేయుచుండును. అతనికి వాహనము నడపు చున్నానను భావన కూడ అంతంత మాత్రముగనే యుండును. ఛలోక్తులతో ఆసక్తికర ప్రసంగములతో, పాటలతో సమయము గడచుచుండగ, ప్రయాణము పూర్తియగును. తాను వాహనము నడపిన భావమే యుండదు. అట్లే కర్మ సన్న్యాస యోగమున స్థిరపడిన జీవునికి కర్మ చేయుచున్నానను భావన యుండదు. కర్మ జరుగుచున్నదన్న భావనయే యుండును. ముందు తెలుపబడిన మూడు అధ్యాయముల నిష్కామకర్మ నిర్వహణ సూత్రములకు యీ అధ్యాయమున ఒక పరిపూర్తి ఏర్పడును.

మనసు కర్మలయందు లగ్నము కాక, దైవము నందు లగ్నమగుటచే కర్మలు అప్రయత్నముగను, అనాయాసముగను సాగునని తెలుపుట కర్మసన్న్యాసయోగ రహస్యము.

**– పార్వతీకుమార్**

గురుపౌర్ణమి
29-7-2007

# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 5వ అధ్యాయము - కర్మసన్న్యాసయోగము)

## ముఖ్య సూత్రములు

1. ఇది కావలెను, యిది వద్దు అను భావము లేక జీవితమును గడుపుట సన్న్యాసము.
2. సన్న్యాస పూర్వకమగు కర్మానుష్ఠానము సన్న్యాస యోగము.
3. మననము ద్వారా బ్రహ్మముతో యోగము చెందియుండుట వలన క్రమముగ బ్రహ్మము అనుగ్రహించును.
4. సర్వభూతాత్మల యందలి అంతరాత్మగ బ్రహ్మమును దర్శించుచు జీవించువానికి కర్మబంధమంటదు. అతడు విశుద్ధుడు, జితేంద్రియుడు.
5. బ్రహ్మముతో యోగమును స్మరణ మాత్రమున పొందియున్న యోగి యింద్రియములతో గాని, మనసుతో గాని కర్తవ్యము లను యాంత్రికముగ నిర్వర్తించుచు నుండును.
6. బ్రహ్మ స్మరణమున నున్న యోగి దినచర్య యంతయు స్వప్నముగ సాగును. కార్యము లన్నియు నీటి బిందువులవలె పడి జారిపోగా, తాను తామరాకువలె నుండును.
7. శరీరము, యింద్రియములు, మనసు, బుద్ధి, కర్తవ్య కర్మలు నిర్వహించుచుండుగ, చేతన యందలి సింహభాగము దైవ స్మరణమున నిలచుట కర్మసన్న్యాస యోగమై యున్నది.

8. పై తెలిపిన కర్మసన్న్యాస యోగమందు నిలచిన వానికి శాంతము స్థిరమై నిలచును.

9. పై విధముగ సన్యసించిన మనసు గల యోగి నవద్వార పురమగు శరీరమున సుఖముగ నుండును. అతని నుండి సర్వకార్యములు జరుగుచుండునే గాని, చేయుచున్న ట్లతని కనిపించదు.

10. కర్మ, కర్తృత్వము, కర్మఫలము ప్రకృతి సంబంధితములు. పరమాత్మయందు లగ్నమైన చేతనగల జీవాత్మకు అవి యంటవు. ఇతరులకు కర్మ చేయుచున్నామను భ్రమ యుండును.

11. పై విధమగు భ్రమ, భ్రాంతి ప్రకృతియం దిముడుటచే జీవాత్మ కేర్పడును. బ్రహ్మము స్మరణతో ప్రకృతిని దాటిన జీవాత్మ కివి యంటవు.

12. మేఘము క్రమ్మినపుడు సూర్యుడు గోచరింపడు. నిజమునకు సూర్యుని దరిదాపులయందు మేఘ ముండదు. భూమి పరిసరములయందే మేఘ ముండును. భూమి జీవులు సూర్యుని మేఘము క్రమ్మినదని భావింతురు. అది వారి భ్రమ. సూర్యుని మేఘము క్రమ్మలేదు. అట్లే ప్రకృతిబద్ధులైన జీవులకు అజ్ఞాన మను మేఘము క్రమ్మును. కాని ప్రతి జీవియు నిజముగ ఒక సూర్యుడే. పరబ్రహ్మము నందు నిష్ఠతో బుద్ధిని నిలిపి, అతని స్మరణమున తన్మయము చెందువారిని కల్మష పూరితమగు అజ్ఞాన మంటదు.

13. అట్టివారికి కుక్కమాంసము నందు, దానిని తిను చండాలుని

యందు, ఏనుగునందు, ఆవునందు విద్యావినయ సంపద గల బ్రాహ్మణుని యందు, సృష్టియందలి సమస్త వస్తు జాల మందు బ్రాహ్మ దర్శనమే జరుగుచుండును. వారిని సమదర్శనులు అందురు.

14. బ్రహ్మమునందు స్థిరపడిన మనసు కలవారు దేహము నందున్నను వారిని జనన మరణాదులు గాని, సంసారము గాని అంటదు.

15. అట్టివాడు స్థిరబుద్ధి కలిగి యుండుటచే మోహపడడు. అతనికి ప్రియముగాని, అప్రియముగాని యుండదు.

16. అట్టివానికి బ్రహ్మమునందే అక్షయమగు సుఖానుభూతి యున్నది. అతడు బాహ్యస్పర్శలతో బంధము లేనివాడై యుండును.

17. బాహ్యస్పర్శ యందుగల సుఖములకు ఆది, అంతము గలవు. భోగ దుఃఖములు గలవు. దివ్య స్మరణమున నిలచినవారు అట్టి ఆద్యంతములు గల సుఖమున యిమడక శాశ్వత సుఖమున నిలతురు.

18. అట్టివానికి శరీర మున్నను లేకున్నను ఒకటియే.

19. సమ్యగ్ న్యాసమున బ్రహ్మమును స్పందన యందు నిరంత రము భావించు యోగికి అంతరంగమున సుఖము, విరామము, జ్యోతిదర్శనము కలుగుచు తనను మరచిన స్థితి ఏర్పడును.

20. పై స్థితి లభించిన సన్న్యాసులు కేవలము కనులు మూసు

కొనియే కాలము గడుపరు. సర్వజీవులకు హితము కలిగించుటయం దాసక్తి కలిగి జీవించు చుందురు.

21. ఇట్టి యోగుల బుద్ధి నుండి, చిత్తము నుండి, యింద్రియ ముల నుండి, వాక్కు నుండి, నడవడిక నుండి బ్రహ్మమే విదితమగును.

22. వీరు ప్రాణాయామ మార్గమున అంతర్గతులై బ్రహ్మోపాసనము చేయుచు, ముక్తస్థితి యందుండగ వీరి నుండి బ్రహ్మమే జీవులకు వలసిన హితమును గావించు చుండును.

23. కర్మ సన్న్యాస యోగులు చేయు కర్మలన్నియు వాని నుండి దైవము నిర్వర్తించునవే. వారికి కర్తృత్వభావమే యుండదు. ఇష్టాయిష్టము లుండవు. కావున కర్మబద్ధులు కారు.

24. సన్న్యాసమను పదమునకు గీతయందలి యీ అధ్యాయమే సరియగు, సంపూర్ణమగు నిర్వచనము. ఈ సూత్రములకు సరిపడనిది సన్న్యాసము కాదు. ఇది సత్యము.

# 1

## కర్మ - జ్ఞానము

**సన్న్యాసం కర్మణాం కృష్ణ పున ర్యోగం చ శంససి ।**
**యచ్ఛ్రేయ ఏతయో రేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్॥ 1**

**సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరా వుభౌ ।**
**తయోస్తు కర్మసన్న్యాసా త్కర్మయోగో విశిష్యతే ॥ 2**

శ్రీకృష్ణా! నీ ప్రబోధమున కర్మయోగము, కర్మత్యాగము రెంటిని పలుకుచున్నావు. ఇంతకును జీవుడు కర్మయోగము నందుండవలెనా, కర్మత్యాగము నందుండవలెనా అని అర్జునుడు ప్రశ్నించినాడు.

అర్జునా! కర్మత్యాగము, కర్మయోగము రెండును విముక్తి కలిగించ గలవు. రెండిటిలో కర్మయోగమే శ్రేష్ఠము.

కర్మల నెవ్వరును త్యాగము చేయలేరు. నిద్రించుట, లేచుట, ఆలోచించుట, భుజించుట, మాటాడుట దేహకి తప్పనిసరి యగు కర్మలు. కర్మత్యాగ మనగా, కర్మఫలత్యాగమే అని తెలియవలెను. అంతియే కాదు, కర్మసంగ త్యాగము కూడ.

కర్మల నాచరించుచు, వానిచే తగులకొనబడకుండుట కర్మ యందు కౌశలము. కర్మలను నిర్వర్తింపకుండుటకు ఎవ్వడును సమర్థుడు కాడు. నిర్వర్తించునపుడు కర్మ సంగము, కర్మ ఫలము కలుగుచుండును. త్యాగము చేయవలసినది సంగము, ఫలమే గాని కర్మలు కాదు.

ఫలముల నాశించక, కర్తవ్య కర్మలను నిర్వర్తించుచు, నిర్వర్తింపబడు కర్మలనుండి సంగము పొందక నిర్వర్తించుట కర్మయోగమే యగును. "*కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన। మా కర్మఫల హేతుర్భూ ర్మా తే సంగోఽ స్త్వకర్మణి ॥*" (2-47) అను నాలుగు సూత్రములుగ కర్మలు నిర్వర్తించు పద్ధతి దైవము తెలిపినాడు. (వివరమునకు పై శ్లోక వివరము చూడుడు). అట్లాచ రించినవాడు కర్మయోగియే. ఈ మార్గమున కర్మ క్షాళనమై, జీవుడు ముక్తుడగునని తెలుపుచున్నాడు.

పై విధముగ కర్మల నాచరించు కర్మయోగి క్రమముగ, కర్తృత్వ భావనను కూడ విసర్జించును. తన నుండి కర్మలు జరుగు చున్నవి గాని, తాను చేయుట లేదని తెలియును. "కర్మ బ్రహ్మోద్భవం విద్ధి" - కర్మ బ్రహ్మము నుండి పుట్టుచున్నదని, బ్రహ్మము అక్షర పరబ్రహ్మము నుండి పుట్టినవాడని, కావున సృష్టియందు కర్మ మనివార్యమని, కర్మమును బ్రహ్మవలె నాచరించినచో జీవుడు ముక్తుడుగ నుండునని ముందే తెలుపబడినది.

కావున కర్మయోగమున నిష్ణాతుడైనవాడు తననుండి జరుగు కర్మ యంతయు దైవ సంకల్పమని తెలిసియుండును. కర్త తాను

కాడు కనుక, కర్మలు చేయుచున్నానను భావన కూడ యుండదు. **కర్తృత్వ భావన లేక చేయుచు నుండును.** ఈ స్థితిని కర్మ సన్న్యాస స్థితి అందురు. కర్మయోగికే కర్మ సన్న్యాస స్థితి లభించును. కర్మలు మానుట కర్మ సన్న్యాసము కాదు.

# 2

# సన్న్యాసము

**జ్ఞేయస్స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।**
**నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధా త్ప్రముచ్యతే ॥ 3**

దేనిని కోరనివాడు, ద్వేషింపనివాడు సన్న్యాసి అని తెలియుము. అతడే నిత్య సన్న్యాసి. అతనికి రాగద్వేషములు లేవు కనుక బంధము లేదు.

కోరుట రాగము. తనకిది అక్కర లేదనుకొనుట ద్వేషము. తనకిది కావలె ననుకొనుట రాగము. ప్రతి జీవికిని జీవితమున కొన్ని జరగవలెనని, కొన్ని జరుగకూడదని అనిపించు చుండును. జరుగవలెనని కోరినవి జరుగుట అంతంతమాత్రమే. అట్లే జరుగ కూడదనుకున్నవి జరుగుట లోకవిదితమే. కష్టము, నష్టము, మృత్యువు రాకూడదని; సుఖము, లాభము, జీవనము సాగవలెనని సామాన్య జీవు లందరును కోరుదురు. కాని జీవితమున నిత్య సత్యమైన చేదు నిజమొకటి తారసిల్లుచునే యుండును. ఆరోగ్యము కోరినను అనారోగ్యము వచ్చును. లాభము కోరినను నష్టము వచ్చును. ఆయుష్షు కోరినను మృత్యువు వచ్చును.

జీవునికి తీరని కోరిక లెప్పుడును మిగిలిపోవును. కోరని బంధములు ఎప్పుడును ఏర్పడుచుండును. తీరని కోరికలు, వదలని బంధములు జన్మపరంపరలు కలిగించు చుండును. వీటన్నిటికిని రాగద్వేషములే కారణము.

జీవితము కర్మానుసారము సాగుచుండగ, కేవలము అందు తన కర్తవ్యమును నిర్వర్తించుచు జీవించువాడు బంధముల నుండి బయల్పడుట కవకాశమున్నది. కర్తవ్యములను నిర్వర్తించినపుడు ఫలితములు కోరుట రాగము. దృష్టి ఫలితములపై నున్నపుడు సత్ఫలితము కొరకై ప్రక్కదారులు తొక్కుట బంధము. కర్మము సత్ఫలితముల నిచ్చినపుడు వానియందు తగుల్కొనుట మరల రాగము. కర్మలు ఫలించనపుడు కలుగునది క్రోధము, ద్వేషము. ఇట్టి ఒడుదొడుకుల జీవితములే అన్నియును.

కర్తవ్యమే తనవంతని, మిగిలిన దంతయు దైవమని భావించి కాలక్రమమున తనను సమీపించు కార్యములను రాగ ద్వేషములు లేక నిర్వర్తించుట నిజమగు సన్న్యాసము. సన్యసించిన బుద్ధితో కర్మల నాచరించుట కర్మసన్న్యాసము. అనగ రాగద్వేషముల నంట నీయక ఆసాంతము కర్తవ్యకర్మలనే నిర్వర్తించుట ఈ శ్లోకమున సూచింపబడినది. అట్లు నిర్వర్తించువారు సంసార మందున్నను సన్న్యాసియే. రాగద్వేషములకు చిక్కినవారు సన్యసించిననూ సంసారులే.

# 3

## కర్మ - జ్ఞానము - సాంఖ్యము

**సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః ।**
**ఏక మప్యాస్థితః సమ్య గుభయో ర్విందతే ఫలమ్ ॥ 4**

కర్మయోగము, జ్ఞానయోగము వేరువేరని భావించువారు పసివారు. తెలిసినవారట్లు భావింపరు. ఇందే ఒక్క దానినైనను ఆచరించువాడు రెండవ దానిని కూడ పొందును.

కర్మ జ్ఞానములు అవినాభావ సంబంధము కలిగియున్నవి. అవి అవిభక్తములు. చేయుచు సాగువానికి చేయుట యందలి జ్ఞానము తెలియుచు నుండును. తెలుసుకొనుచు ఆచరించు వానికి ఆచరించుట యందలి నేర్పు కలుగును. ఆచరించుట, తెలియుట, తెలుసుకొనుచు ఆచరించుట రెండును అవిభక్తముగ సాగునే గాని తెలుసుకొనుట ముఖ్యమని, ఆచరించుట ముఖ్య మని విడదీయుట తెలియని తనము.

ఆచరించువాడు తెలుసుకొనుచు ఆచరించవలెను. తెలుసు కొనువాడు తెలుసుకొనుచు ఆచరించవలెను. ఇట్లొకదాని వెంట

ఒకటి జరుగుటయే యుండును గాని, కేవలము తెలుసుకొని ఆచరించకపోవుట, ఆచరించుచు తెలుసుకొనకపోవుట యుండదు. పశువులు సైతము ఆచరించుచు తెలుసుకొనుచు, తెలుసు కొనుచు ఆచరించుచు యుండును. ఇందులో ఏది ముఖ్యము? అను ప్రశ్న పసితనమే. ఉదాహరణకు మామిడిపండు రుచి ఎట్లుండునో తెలుసుకొనినవాడు రుచి చూచుట మానునా? మామిడిపండు భుజించినవాడు రుచి తెలియక యుండునా? కేవలమొక చొప్పదంటు ప్రశ్న అర్జునుడు వేసినా డనిపించును. అర్జునుడు నరులకు ప్రతినిధి. నరులలో విపరీత వ్యాఖ్య చేయు వారుందురు. అట్టివారికి కూడ సమాధానము తెలియవలెనని అర్జును డట్లు ప్రశ్నించినట్లు గోచరించును.

పై ఉదాహరణలో మామిడిపండు భుజించుట ఆచర ణము (కర్మయోగము). భుజించునపుడు మామిడిపండు రుచి ఎట్లుండునో తెలియుట జ్ఞానయోగము. కర్మయోగము లేని జ్ఞాన యోగము లేదు. అందులకే ముందు కర్మయోగము తెలుప బడినది. అటుపైన జ్ఞానయోగము తెలుపబడినది. పండు భుజించిన వానికి రుచిజ్ఞాన మెట్లును కలుగును. రుచి జ్ఞానము కలిగి, పండు భుజింపనిచో ఆ జ్ఞానము అనుభవైక జ్ఞానము కాక, మానసికము గనే యుండిపోవును. పై కారణమున కర్మయోగమే శ్రేయస్కరమని దైవము గీతయందు పదే పదే పలుకుచుండును. ఆచరించుచు తెలుసుకొనుట సులభము. తెలుసుకొనువాడు ఆచరించుట మాని యింకను తెలుసుకొనవలెనని భ్రాంతిపడుట భ్రష్టతను కలిగించును.

తెలిసినంతమేర ఆచరించుట అవసరము. మొత్తము తెలిసిన వెనుక ఆచరింతు ననువాడు మూర్ఖుడు. తెలిసినది ఆచరించుచుండగ మరికొంత తెలియుట యుండును. గాలిని పీల్చుచు వదలుచు నుండవలెను గాని, రోజు మొత్తమున కొక్కమారు పీల్చి, ఒక్కమారు వదలుట సాధ్యమా? చీకటిలో చిన్న దీపము ఒకటి రెండడుగుల మేర దారి చూపును. ఒక మైలు దూరము ఈ చిన్న దీపముతో ఎట్లు ప్రయాణము చేయగలను అనుకొనువాడు మూర్ఖుడు. దీపము చూపునంతమేర నడచినచో మరి రెండడుగుల మార్గము కనుపించును. కేవల మాలోచించు వానికి నడక సాగదు. చిన్న దీపపు కాంతితో పెద్ద అడవిని కూడ దాటవచ్చును. అతి చిన్నదియైన నావతో పెద్ద నదిని దాటవచ్చును. ఆచరణ వలన జ్ఞానము లభించుచునే యుండును. అనుభవైక జ్ఞానము నుండి మరికొంత ఆచరణ, మరికొంత జ్ఞానము లభించు చుండును. అట్లుకాక మీన మేషములు లెక్కించుచు చతికిల పడువానికి జ్ఞానయోగము లేదు. కర్మభ్రష్టత వలన జీవితము కూడ చెడును.

ఆచరించుచు సాగువానికి జ్ఞానము కలుగుచు నుండును. కర్మయోగమున కర్మాచరణమునకు దైవము నాలుగు సూత్రముల నిచ్చినాడు. అవి వరుసగా యిట్లున్నవి.

1. నీకు కర్మ నిర్వర్తించు అధికారమున్నది.

2. కర్మఫలములయందు నీ కధికారము లేదు. కావున

ఫలముల కాశించుచు కర్మము నిర్వర్తించుట వలదు. కర్మము నిష్కామమే కావలెను.

3. కర్మ నిర్వహణమున వక్రమార్గముల ననుసరింపకుము. అట్లు చేసినచో కర్మ నిన్ను బంధించగలదు.

4. ఫలితమాశింపక, వక్రత లేక కర్తవ్యకర్మను నిర్వర్తించు నపుడు ఫలితములు సామాన్యముగ, వైభవముగ నుండును. వైభవము, శోభనములకు ఆకర్షింపబడక కర్తవ్యకర్మ యందు కొనసాగుము.

పై విధముగ నాచరించు వానికి కర్మాచరణము సుఖము నిచ్చును. ఆచరణయందే సుఖమున్నదని, ఫలితముల యందు కాదని తెలియును. అట్లాచరించు వారు జ్ఞానయోగమున తెలిపిన పండ్రెండు కర్మ యజ్ఞములను ఆచరించు సమర్థతను పొందుదురు. ఆచరణమున పరహితము మెండై, స్వహితము మరుగున పడు చుండును. ఆచరణయందు పవిత్రత పెరుగుచునుండుగ, రాగ ద్వేషములు లేని ఆచరణ సిద్ధించును. అదియే సన్న్యాసమని ముందు శ్లోకమున దైవము తెలిపినాడు. జ్ఞానము, ఆచరణము, సమన్వయింపబడినపుడు ఏర్పడు వైరాగ్యము కారణముగ జీవుడు పొందు స్థిరతయే సాంఖ్యము. అదియే యోగస్థితి.

# 4

## సాంఖ్యము - యోగము

**యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగై రపి గమ్యతే ।**
**ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥ 5**

జ్ఞానయోగులచే పొందబడు గమ్యమే కర్మయోగము చేతను పొందబడుచున్నది. కర్మ జ్ఞానములు రెండిటిని ఒకటిగ చూచువాడే తెలిసినవాడు.

ఏమి చేయవలెనో, ఎట్లు చేయవలెనో తెలిసి కర్మమును చేయుట కర్మబంధము నుండి జీవునికి విముక్తి కలిగించును. విముక్తి కలిగిన తరువాత కూడ కర్మాచరణమే యుండును. ఆచరణమే ఆనందమయమై నిలచును. అపుడు నిర్వహించునది దివ్యకర్మ యని పిలువబడును. మహాత్ము లందరును దివ్య కర్మమునే నిర్వర్తించు నుందురు. వారికి కర్మబంధము లేదు. ఆచరణమందలి ఆనందమే యుండును. ఫలితముల యందు వారి కాసక్తి యుండదు. దేనిని గూర్చి రాగము గాని, ద్వేషముగాని యుండదు. తటస్థ స్థితి యందుండి తమ వద్దకు వచ్చిన కర్మను

ధర్మ మాధారముగ నిర్వర్తింతురు. ఇట్టి తటస్థస్థితి వశిష్ఠ, అగస్త్యాది మహర్షులు నిర్వర్తించి చూపిరి. ఇదియే నిజమగు సన్న్యాసము.

దైవము గీతయందలి రెండవ అధ్యాయమున బుద్ధిని ఆశ్రయింపమని తెలిపెను. మూడవ అధ్యాయమున కర్మ మాచరింపమని తెలిపెను. నాల్గవ అధ్యాయమున కర్మాచరణము త్యాగస్ఫూర్తిని కలిగించి, పరహిత యజ్ఞములనెట్లు నిర్వర్తింప చేయునో తెలిపెను. తదనుగుణమగు జ్ఞాన మెట్లబ్బునో తెలిపెను. ఐదవ అధ్యాయమున తటస్థస్థితిని చేరుట తెలుపుచున్నాడు. ఈ సోపానములను యిట్లే అధిరోహించుట వలన ప్రాపంచిక బంధములు తప్పక తొలుగగలవు. భగవద్గీత యందలి అధ్యాయము లన్నియు యిట్లొక ఆరోహణ క్రమమును కలిగియున్నవి. యోగ మనగ క్రమముగ యిందలి సోపానములను అధిరోహించుటయే.

మొదట బుద్ధిని ప్రచోదనము గావించుకొని, చేయదలచిన పనులను చేయుట కాక, చేయవలసిన పనులను చేయుట నేర్వవలెను. చేయవలసిన పనులు చేయుచున్నపుడు ఫలితముల నాశించుట, ఫలితముల కొరకై వక్రతల నాశ్రయించుట, కర్మ ఫలములకు రాగము కారణముగ లొంగుట విసర్జించవలెను. అట్లు చేయు కర్మాచరణము శుద్ధమై త్యాగపు తీరములు చేరును. అపుడే ద్రవ్యాది ద్వాదశ యజ్ఞములు నిర్వహించు సామర్థ్యము కలుగును. అట్లు కర్మయం దుత్తీర్ణుడైనవాడు తటస్థ స్థితిని చేరి సన్న్యాసి యగును. ఇదియొక ముఖ్యమగు క్రమము. తోచినది తోచినట్లు చేయుటగాక, పై క్రమము ననుసరించి యుండవలెను.

## 5

# ముని - మననము - బ్రహ్మము

**సన్న్యాసస్తు మహాబాహో దుఃఖ మాప్తు మయోగతః ।**
**యోగయుక్తో ముని ర్బ్రహ్మ న చిరేణాధిగచ్ఛతి ॥ 6**

గొప్ప బాహువులుగల ఓ అర్జునా! కర్మ సన్న్యాసము కర్మ యోగము లేకుండ పొందుట దుఃఖము కలిగించును. కర్మ యోగముతో కూడిన మననశీలుడు శీఘ్రముగ బ్రహ్మమును చేరుచున్నాడు.

సన్న్యాస మను పేర పనిమానుట, పని తప్పించుకొనుట భ్రష్టత్వమును కలిగించును. పని దొంగలే కాషాయము ధరించి కపట సన్న్యాసులై తిరుగుచు నుందురు. నిజమగు సన్న్యాసులు (కాషాయము ధరించి యున్నవారు) ఈ కపట సన్న్యాసుల కారణ ముగ, ఒక్కొక్కప్పుడు అనుమానింపబడుదురు. మన దేశమున బిచ్చగాంన్డ్రందరు కాషాయమే ధరించి తిరుగుచూ ఉందురు. అందు నిజమగు సన్న్యాసులు లేకపోలేదు.

నిజమగు సన్న్యాసులు సతతము దైవస్మరణము చేయుచు

నుందురు. వారి ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసలయందు దివ్యస్మరణమే సాగుచునుండును. అట్టివారు దేహమునకు ప్రాధాన్యమీయక దైవమే ప్రధానముగ, ఆధారముగ మననము చేయుచు మునివలె జీవించుచుందురు. వారి సంస్కారమున ప్రాపంచిక ఆకర్షణలు జారిపోవుటచే వారు కేవలము దైవస్మరణ చేయుచు, దొరికినది భుజించుచు, నిదురవచ్చినపుడు నేలపై నిద్రించుచు, నదీ తటాక ముల స్నానములు గావించుచు, గృహములందు కాక ప్రకృతి యందే జీవించుచు నుందురు. ప్రపంచమున సన్న్యసించి జీవించుట సులభము కాదు. దేహభ్రాంతి, దేహావసరములు లేనివారే అట్లు జీవింతురు. అట్టివారు గౌరవింపదగినవారు. కాని అట్లు జీవించుట కష్టము అని దైవము తెలుపుచున్నాడు. కష్ట మనగ అసాధ్యమని కాదు. కాని అది సాధ్యపడినవారు కొందరే యుందురు.

కష్టతరమగు ఆ మార్గముకన్న ముందు తెలుపబడిన కర్మ జ్ఞాన యోగముల ద్వారా శీఘ్రముగ దైవమును చేరవచ్చునని దైవమే తెలుపుచున్నాడు. బుద్ధియోగముతో కర్తవ్యములను నిర్వర్తించుచు దివ్యస్మరణ యందుండుట మేలని తెలుపు చున్నాడు. అనగా శ్వాసయందు స్మరణ సాగుచుండగ, కర్తవ్యము లన్నిటిని ఉదాసీన తతో నిర్వర్తించుచు నుండుట. చిత్తము శివుని పైన, చేతులు ప్రపంచములో నుంచుట కూడ సన్న్యాసమే అని కృష్ణుని మతము. వశిష్ఠాది బ్రహ్మర్షులు అట్లాచరించినవారే. జనకాది రాజర్షులు కూడ అట్లాచరించిన వారే.

సన్న్యాస మనగ సమ్యక్ న్యాసము. అనగ ఒడుదొడుకులు

లేని స్మరణ. హృదయమందు 'సోఽహం' శబ్ద రూపమున వసించి యున్న దైవమునందు బుద్ధిని నిలిపి దైనందిన కార్య క్రమములను యథాలాపముగ నిర్వర్తించువాడు కూడ సన్న్యాసియే. సరళమగు మార్గముండగ దుఃఖపూరితమగు మార్గమేల? జీవులలోని రజస్త మస్సులు వారి నెప్పుడును ప్రపంచములోనికి నెట్టుచునే యుండును. లభించినది భుజించుట, ఏ ప్రదేశమున నైనను నిద్రించ గలుగుట, ఎప్పుడును హృదయమున స్మరణయందే యుండుట, దేహాభిమానము లేకుండుట, దేహియైన జీవునకు దుఃఖకరము. దేహముతో పని చేయించుచు, బుద్ధితో దైవస్మరణ యందుండుట సులభము. ఇట్లుండువారు దేహముతో చేయు పనుల ద్వారా ప్రపంచమున చిక్కుపడియుండక యుండుటకు కర్మజ్ఞాన రహస్యములను తెలిపినాడు.

ఇచ్చటొక ముఖ్య సూత్రమున్నది. బుద్ధియోగమున చేరి, కర్మ జ్ఞాన యోగ సూత్రముల సహాయముతో చిక్కుపడక యుండుట మాత్రమే పరమావధి కాదని, మననము జరుగవలెనని దైవము బోధించు చున్నాడు. అనన్య మననము వలననే జీవుడు బ్రహ్మమును పొందగలడు. మననము ఎట్లు చేయవలెను? "దైవమే నేనుగ నున్నానని" చేయవలెను. అదియే "సోఽహం" అను మంత్రము. 'సహ' అనగ అతడు. 'అహం' అనగ నేను. "అతడే నేను" అని హృదయము ఘోషించుచున్నది. దానియందు స్థిరపడుట సన్న్యాసము. అట్లు నిరంతరము న్యాసపూర్వక మననము ఎవని యందు జరుగునో అతడే ముని. అతడు బ్రహ్మమును అచిరకాలమున చేరగలడు.

## 6

# సోపానములు - యోగము

**యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః ।**
**సర్వభూతాత్మ భూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥ 7**

యోగయుక్తుడైనవాడు పరిశుద్ధమైన హృదయము గల వాడగును. మనోవికారములను జయించిన వాడగును. ఇంద్రియ ములను జయించిన వాడగును. సమస్త ప్రాణికోటి యందును ఒకే ఆత్మ యున్నదని తెలిసినవాడు. ఇట్టి జ్ఞానము గలవాడు పనులాచరించు చున్నప్పుడు గూడ బంధమున పడడు.

యోగయుక్తు డనగ విచక్షణ (బుద్ధి)తో నిష్కామముగ కర్తవ్యముల నాచరించుచు, త్యాగనిరతితో జీవించుచు నుండు వాడని ముందు అధ్యాయము లందలి సారాంశము గ్రహించినచో తెలియును. అట్టివాడు యింద్రియ వినియోగము విచక్షణతో గావించును. కావున జితేంద్రియు డగును. ఇంద్రియ వ్యాపార ములు శమించినపుడు మనసునకు పూర్ణమగు జయమే లభించును. అట్టి మనసు కామబద్ధము కాదు గనుక, బుద్ధియను వెలుగును ప్రతిబింబింపజేయుచు పూర్ణచంద్రునివలె యుండును.

కామము మితిమీరినపుడే మనసునకు హెచ్చుతగ్గు లుండును. కామము విచక్షణకు లోనుగ పనిచేయుచుండుట వలన మనసునకు స్థిరము కలుగును. వికారములు చెందక యుండును. అట్టి వానిని 'విజితాత్మ'డని దైవము సంబోధించు చున్నాడు.

నిర్మలమగు మనసు కలిగినవానికి హృదయము విశుద్ధమై యుండును. పరిశుద్ధమై యుండును. పరిశుద్ధమగు హృదయము, ప్రశాంతమగు మనస్సు, విధేయులైన యింద్రియములు గల జీవుడు నిర్వర్తించు కార్యములు క్రమబద్ధముగ నుండును. అందు ఫలాసక్తి లేదు. ఫలితముల యందు ఆకర్షణయు లేదు. చేయుట యందు వక్రతయు లేదు. అట్టి వానిని కర్మలెట్లు బంధించగలవు? బంధించలేవు. వాని కనుదిన కర్మాచరణము ఆనందమే. వాని కాచరణమే ఆనందము. అట్టివాడు యోగయుక్తుడు.

యోగయుక్తుడైన వాడు, భగవత్స్మరణమున కూడ యుండునని ముందు శ్లోకమున దైవము తెలిపినాడు. పై తెలిపిన నియమములకు మననము కూడ తోడైనచో అన్ని జీవుల యందు తన యందున్నవాడే యున్నాడని తెలియును. ఇది ఒక చక్కని సోపానక్రమము.

| | | |
|---|---|---|
| 1. విచక్షణ | ఇంద్రియముల నిబద్ధత | జితేంద్రియుడు |
| 2. నిష్కామ కర్మ | మనసు ప్రశాంతత చెందుట | విజితాత్మ |

| | | |
|---|---|---|
| 3. యజ్ఞార్థ కర్మ | మనసు నిర్మల మగుట | విశుద్ధాత్మ |
| 4. సన్న్యాసము | రాగద్వేషములు మనస్సు విడచుట | యోగము |
| 5. మననము | అన్నిజీవులయందలి ఆత్మను దర్శించుట | ముక్తస్థితి. |

అధ్యాయముల యందలి సూత్రములను పూసకెక్కించి నట్లుగ అమర్చుకొనుచు, అవగాహన చేసుకొనుచు శ్రద్ధాళువగు ఆత్మ సాధకుడు ముందుకు సాగవలెను.

నిత్యము భగవత్స్మరణము నందుండువాడే (మననము చేయువాడె) ముని యని తెలుపబడినది. అట్లు స్మరణము చేయుటవలన అన్నిటియందు మూలముగ నున్న బ్రహ్మమును పొందగలడని కూడ తెలుపబడుచున్నది. అనగా అన్నిటి యందలి దైవము దర్శించినవాడు మననము ఫలించనివాడే యగుచున్నాడు. మననము జరుగుటకు హృదయ నైర్మల్యము, మనోప్రశాంతత ఆధారమై యున్నవి. మనోప్రశాంతతకు కామము లేని కర్తవ్య కర్మ, విచక్షణ ఆధారములై యున్నవి. ఇటుకమీద యిటుక పేర్చి యిల్లు కట్టినట్లు, ఈ వరుస క్రమమును గ్రహించి అట్లాచరించి పురోగతి చెందవలెనే గాని, మరియొక మార్గము లేదు. సరాసరిగ అందరి ఆత్మలయందు వసించియున్న దైవమును చూచుట వీలుపడదు. "విశ్వం విష్ణుః" అని పలుకుట సులభమే. తెలియుట శ్రద్ధాళువునకు మాత్రమే అనుభవైకము.

# 7

# గమనిక; సాక్షిత్వము

**నైవ కించి త్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ జిఘ్రు న్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥ 8**
**ప్రలపన్ విసృజన్ గృహ్ణ న్నున్మిష న్నిమిష న్నపి ।**
**ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ॥ 9**

పరతత్త్వముతో యోగయుక్తుడైన తత్త్వవేత్త చూచుచున్నను, వినుచున్నను, తాకుచున్నను, వాసన చూచుచున్నను, తిను చున్నను, నడచుచున్నను, నిదురించుచున్నను, శ్వాసను నిర్వ ర్తించు చున్నపుడును, మాట్లాడుచున్నను, విషయములు గ్రహించు చున్నపుడును, కళ్ళను తెరచినను, మూసినను, ఈ సమస్తమును సాక్షీభూతుడుగ గమనించుచునే యుండును గాని, తానే చేయు చున్నాడని భావింపడు.

పై విధముగ నుండుట నొక విచిత్రము. కాని పరతత్త్వము నాశ్రయించిన వానికి, యోగయుక్తుడైన వానికి యిది సత్యము. యోగయుక్తుడైనవాడు తన శరీరమును, యింద్రియములను,

మనసును తనకన్న వేరుగ గమనించును. అతనికి మనసు, యింద్రియములు, శరీరము ఒక వాహనము వంటివి. బాహ్య ప్రపంచమున పనిచేయునపుడు శరీరము నతడు వాహనముగ వాడును. ఆవశ్యకత లేనపుడు దానియందుండక, తనయందు తా నుండును.

తనయందు తానున్న యోగికి తన శరీరావసరము లన్నియు తనవనిపించవు. అవి ప్రకృతి గుణముల వలన ఏర్పడినవని, ఆ గుణములే పంభూతములతో రూపుగట్టుకొని యున్నవని తెలిసి యుండును. అది క్షరమని, తా నక్షరుడని తెలిసి యుండును. తాను ఆత్మయని, తన ఎరుక బుద్ధియని, ఆత్మ-బుద్ధిగ తా నున్నాడని, మనస్సు, ఇంద్రియములు, దేహము ద్వారా బహిర్గతు డగు చున్నాడని, తన దేహము రక్త మాంసాదులు కలిగి యున్నదని తెలిసియుండును. అట్టివానికి దేహాత్మ భావముండదు. ఆత్మ భావనయే యుండును.

ఉదాహరణకు, మన కొక గుఱ్ఱము (ఎక్కి తిరుగుటకు) ఉన్నదనుకొనుడు. గుఱ్ఱము నెక్కి సమస్త కార్యములు నిర్వహించి, అటుపైన గుఱ్ఱమును దిగి మనము మన గృహమున నుందుము. గుఱ్ఱము చూచుచున్నను, వినుచున్నను, తాకుచున్నను, వాసన చూచుచున్నను, తినుచున్నను, కదలుచున్నను, ఊపిరి పీల్చి విడచుచున్నను, కండ్లు తెరయుచు మూయుచున్నను సాక్షీభూతు లమై చూతుము గాని అవి యన్నియు మనము చేయుచున్నా మనుకొనము గదా! మన వాహనము మనకన్న వేరని మనకు

తెలియును. వాహనపు చేష్టలు మన చేష్టలు కాదని మనకు తెలియును. అదే విధముగ యోగయుక్తుడు తా నక్షరుడగు ఆత్మ యని; మనసు, యింద్రియములు, శరీరము తన వాహనమని, వాహనపు మనో యింద్రియపు వ్యాపారములు తనవి కావని తెలిసియుండును. ఇట్టి వారిని కర్తృత్వ భావనను దాటిన వారని తెలుపుదురు. ఇట్టివారే సన్న్యాసులు. వారు సాక్షితనమున నుందురు. సమస్త కర్మలు తమనుండి జరుగుచున్నపుడు కూడ సాక్షిగనే యుందురు. తాము బ్రహ్మమునందే మనన మార్గమున యందురు.

## 8

# తామరాకు - నీటి బిందువు

**బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్ర మివాంభసా ॥** 10

బ్రహ్మమునకు సమర్పితముగ, సంగము విడచి కర్మల నెవరైతే నాచరింతురో, అట్టివారిని పాప మంటదు. నీటిబొట్లు ఎన్ని పడినను, తామరాకు నంటవు కదా!

ఉషా సమయమున మంచుబిందువులు తామరాకులపై పడుట, ఆ బిందువులు సూర్యరశ్మికి ముత్యములవలె ప్రకాశించుట చూచి మనస్సంతయు ఆహ్లాదము చెందును. అట్లే బ్రహ్మమునకు సమర్పితము చేసిన మనసుతో కర్మ లాచరించువారు, వాని ఫలముల యందు ఆసక్తి లేకుండుటచే చేయు పనులు ఆహ్లాదము కలిగించుచు నుండును. ఆసక్తి ఫలముల యందు కలిగినచో ఆహ్లాదము లేకపోగా మనసు ప్రపంచమున కంటును. నీటి బిందువు తామరాకుపై నున్నను, తామరాకునకు దానిపై ఆసక్తి లేదు. అట్లే కర్మలను మనసు ద్వారా ఆచరించువాడు ఫలములయం దాసక్తి లేక ఆచరించినచో అతనిని ఆ కర్మలు

బంధించవు. అంటను కూడ నంటవు. నీటి బిందువులు ప్రతి నిత్యము తామరాకుపై రాలుచు నుండును. ఆకునుండి జాలు వారుచు పోవుచునుండును. ఈ విషయమున తామరాకు సాక్షీ భూతముగ నుండునే గాని రాలిపోవుచున్న బిందువులను గూర్చి బాధపడదు. కర్మము లన్నియు వచ్చి పోవునవే. తా నాధారముగ అనేకానేక కర్మలు వచ్చి, నిర్వర్తింపబడి పోవుచునుండును. తామరాకు నీటి బిందువుల ననుసరించనట్లే, కర్మల ననుసరించి బుద్ధి పోరాదు. బుద్ధి ననుసరించి మనస్సుండవలెను. కర్మలు నిర్వర్తింపబడుచున్నను, బుద్ధిని దైవముపై నిలపిన, కర్మలు జరిగి పోవుట, తాను దైవముతో నుండుట జరుగును. "బుద్ధిః కర్మాను సారిణీ" అను నానుడి కలదు. సామాన్యుల బుద్ధి కర్మల ననుస రించుచు పోవును. అపుడతడు కర్మబద్ధుడగును. బుద్ధిని దైవముతో జోడించి, మనస్సేంద్రియ దేహములతో కర్మలను నిర్వర్తించుట వలన ఆనంద ముండును గాని బంధ ముండదు.

ముందు శ్లోకమున మననము ద్వారా దైవముతో సంబం ధము ఏర్పరచుకొనుట తెలుపబడినది. ఆ బంధము పటిష్ఠమైనచో నిర్వర్తించు కర్మలయందు ఫలాసక్తి యుండదు. దైవమునం దాసక్తి చెందిన బుద్ధి, ఫలములయం దాసక్తి కలిగి యుండదు. అట్టి వానిని కర్మ లంటవు.

## 9

# యోగి - కర్మ నిర్వహణము

**కాయేన మనసా బుద్ధ్యా కేవలై రింద్రియై రపి ।**
**యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాஉஉత్మ శుద్ధయే ॥ 11**

ఆత్మశుద్ధిగల యోగులు సంగము లేక కర్మ నిర్వర్తింతురు. కర్మ నిర్వహణము శరీరము చేత, యింద్రియముల చేత, మనసు చేత నిర్వర్తింప చేయుచున్నను, యోగమున నిలచియే చేయుదురు.

శరీరము, యింద్రియములు, మనసు ఈ మూడింటిని కలిపి దేహ మందురు. దానిని ధరించినవాడు మానవుడు. మానవుడు, అతని దేహము అను వర్గీకరణము అవగాహన నిచ్చును. సదవగాహన గల మానవుడు బుద్ధియందుండి మనసు, యింద్రియములు, శరీరమును తన వాహనముగ వినియోగించుచు కర్మల నాచరించును. అట్లాచరించు వాడు బుద్ధియందు దైవస్మరణమున నుండుటచే దైవముతో యోగము చెంది యుండును. దైవముతో యోగము చెందుట వలన కర్మల యందు సంగము లేక నిర్వర్తించుట ఏర్పడును.

కేవలము సంగము లేక కర్మలను నిర్వర్తించుట సాధ్యము కాదు. బుద్ధి సంగము దైవముతో నున్నపుడు కర్మముతో నుండదు. అందులకే ముందు శ్లోకము నందు మననము తెలుపబడినది. బ్రహ్మమును స్మరించుచు యుండుటయే యిచ్చట తెలిపిన మననము. మననము వలన మానవుని బుద్ధి దైవముతో యోగము చెందియుండును. అట్టి వాడు యోగయుక్తుడు. యోగయుక్తుడు క్రమముగ జితేంద్రియు డగునని, జయింపబడిన మనసు గల వాడగునని, కల్మషములు తొలగిన వాడగునని, సర్వభూతముల యందలి ఆత్మ తత్త్వము నెరిగిన వాడగునని, కర్మలయందు సంగమము కూడ తొలగిన వాడగునని 6,7,8,9 శ్లోకములందు తెలుపబడినది. పాఠకులకు అదే విషయమును మరల మరల తెలియపర్చుట ముఖ్యము. 'చర్విత చర్వణము' అనునది సాధన మార్గమున అతిముఖ్యము. తెలిసిన దానినే మరల మరల తెలియ చెప్పుట బోధన మగును.

పై విధముగ నేర్పడుటకు కారణము కర్మ జ్ఞాన యోగ మందలి సూత్రములను క్రమముగ ఆచరించుటే. అట్లాచరించని వానికి ఈ స్థితి ఏర్పడదు. ఈ అధ్యాయమున ప్రత్యేకముగ తెలుప బడిన సూత్రము కోరిక, ద్వేషములను విసర్జించుట, మననము హృదయమున చేయుచు నుండుట, అందరి యందలి ఈశ్వరుని గుర్తించుట. వీటికారణమున నీటి బిందువులు అంటని తామరాకు వలె కర్మఫలము లంటని యోగి ఏర్పడును.

# 10

# నైష్ఠికులు

**యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతి మాప్నోతి నైష్ఠికీమ్ ।**
**అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥** 12

యోగయుక్తుడై నిష్ఠగ కర్మము నాచరించువాడు శాంతిని పొందును. యోగయుక్తుడు కానివాడు కర్మఫలములయం దాసక్తు డగుటచే, కోరికల రూపమున బంధింపబడు చున్నాడు.

దైవము కర్మాచరణము విషయమున అనేక పర్యాయ ములు విసుగు, విరామము లేక ప్రేమతో, ఆదరణతో, కరుణతో ఒకే సూత్రమును తెలుపుచున్నాడు. ఇన్నిమార్లు చెప్పిన విషయ మునే చెప్పుటయందు అతడెంత ఆత్మీయుడో మన మెరుగవలెను. ఆత్మబంధువు లనిన యిట్టి వారే. తెలిపినదే మరల మరల తెలుపుచు, శ్రేయోమార్గము గుర్తు చేయుచు నుందురు.

కర్మ మనగ కర్తవ్యకర్మ. కర్తవ్యము నిర్వర్తించవలసినదే. నిర్వర్తింపబడకుండుట కుదరదు. దప్పిక కలిగినపుడు నీరు త్రాగవలసినదే, ఆకలి కలిగినపుడు ఆహారము భుజింపవలసినదే. మరియొక మార్గము లేదు.

కర్తవ్యములు నిర్వర్తించుట, కోరికలను తీర్చుకొనుట ఒకటి కాదు. దప్పిక గొన్నపుడు నీరు త్రాగుట. ఆకలి కలిగినపుడు తగు మాత్రము భుజించుట కర్తవ్యము లగును. అవి కోరికలు కావు. కర్తవ్యము లేవియో, కోరిక లేవియో ఎవరికి వారుగ తెలుసుకొన వచ్చును. ఈ విషయమున పెద్ద విద్య లక్కరలేదు. విచక్షణ చాలును. **విచక్షణ లేనివానికి కర్తవ్యములు, కోరికలు కలగాపులగమై కోరికలే కర్తవ్యములుగ భ్రమ గొల్పును.** ఇట్టి వారికి ఉప్పు-కప్పురము ఒక్క మాదిరిగనే గోచరించును. పేడ-బెల్లము తేడా కూడ తెలియదు.

నిర్వర్తించవలసినది కర్తవ్యమే గాని కోరికలు కాదు. కర్తవ్య ములు కాని కర్మ కేవలము ఫలములం దాసక్తి వలననే చేయవలె ననిపించును. ఫలాసక్తియే కామము. కామము వలన ఫలాసక్తి ఈ రెండును బలిమిగ అల్లుకొని యుండును. ఇట్టివారికి కర్తవ్య మేమో తెలియదు. కర్తవ్యమునకు సౌకర్యము అసౌకర్యము, లాభము నష్టము, జయము అపజయము అనునవి అప్రధాన ములు. ఉదాహరణకు గృహమునం దెవ్వరికైన తీవ్ర అస్వస్థత ఏర్పడినపుడు నిద్రాహారములు మాని సేవచేయుదురు. సౌకర్యము కాదని మానరు కదా! అట్లే వివాహాది సందర్భములలో రాత్రి పగలు శ్రమపడుదురు. సౌకర్యము కాదని మానరు కదా! ఎంత ఖర్చైనను, అప్పులు చేసియైనను పిల్లలను చదివింతురు. నష్టమని భావింపరు కదా. బాధ్యతాయుత కార్యములను నిర్వర్తించునపుడు జయాప జయములను చూడరు గదా! వైద్యుడు ఔషధము నిచ్చుట

కర్తవ్యము. శస్త్రచికిత్స చేయుట కూడ కర్తవ్యము. వ్యాధి తగ్గునో తగ్గదో అని భావించుచు మీన మేషములు లెక్కపెట్టడుగదా! వ్యాధి నివారణముతో సంబంధములేక, వ్యాధి నిర్మూలనమునకు తనకు తెలిసిన విద్యను వినియోగించుటయే కర్తవ్యము. ఇది నిష్ఠ.

అర్జునుడు యుద్ధమున గెలుతుమో లేదో అని కూడ పలికినాడు. జయాపజయములతో సంబంధము లేక, క్షత్రియుడు ధర్మరక్షణమునకు యుద్ధము చేయవలెనని దైవము తెలుపుచున్నాడు.

ఇట్లు కర్తవ్యమును నిర్వర్తించువారు దైవముతో యుక్తులై నిర్వర్తించుటవలన శాంతిని బొందుచున్నారు. ఇట్లుకాక కోరికలను ఫలములం దాసక్తితో నిర్వర్తించువారు యోగయుక్తులు కాకపోవుట వలన బంధింపబడు చున్నారు. వారి కర్మలే వారిని బంధించుచున్నవి. నైష్ఠికులు శాంతిని పొందుదురు. ఇతరులు పొందలేరు. అనగా ఫలాసక్తి యందు తగులుకొనక కర్తవ్య కర్మల నాచరించువారే శాంతిని పొందెదరు. వారు నిష్ఠగలవారగుటచే నైష్ఠికులని తెలుపబడిరి.

# 11

## మానసిక సన్న్యాసము

**సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్న కారయన్ ॥ 13**

మనసున సన్న్యాసము స్థిరపడిన జీవుడు నవద్వారపురమగు దేహమందు సుఖముగ జీవించును. సుఖ మతని వశమున నుండును. సర్వకర్మలు అతని నుండి నిర్వర్తింపబడు చున్నను అతడు కర్త కాడు, కారణము కూడ కాడు.

సన్న్యాస మనగ ముందు శ్లోకముల యందు దైవము నిర్వచన మందించినాడు. 1. దేనిని కాంక్షింపనివాడు, ద్వేషింపని వాడు సన్న్యాసి. 2. సతతము దైవముతో మనన మార్గమున యోగయుక్తుడైనవాడు సన్న్యాసి. సన్న్యాస దీక్ష వలన యింద్రియ ములు నియమమున నుండగలవు. మనసు పరిశుద్ధమగును. 3. సన్న్యాసి సర్వజీవుల యందలి దైవమునే దర్శించుచుండును. 4. తన నుండి జరుగుచున్న మనో దేహేంద్రియ వ్యాపారములను మననమున నుండి వీక్షించువాడు సన్న్యాసి. 5. దైనందిన కార్యము లన్నియు తన మనసున ఆలోచనల రూపముగ వచ్చి, నిర్వర్తింప

బడి పోవుచున్నవని గ్రహించువాడు సన్న్యాసి. అట్టివాడు నీటి బిందువులచే అంటబడని తామరాకువలె నుండును. 6. కర్మ ఫలములను త్యజించినవాడు సన్న్యాసి. మననముతో దైవ యుక్తు డగుటచే ఇది సాధ్యపడును.

పై ఆరు గుణములు కల జీవుని మనసున సన్న్యాసము స్థిరపడి యుండును. సుఖ మతని వశమున నుండును. అట్టివాడు దేహము నందుండుటకు ఎట్టి అసౌకర్యముండదు. నిజమున కిట్టి సన్న్యాసియే మానవదేహ సౌలభ్యము, సౌకర్యము అనుభూతి పరముగ నెరిగి యుండును.

పై సర్వమును గృహస్థు అయినను నిర్వర్తించుకొన వచ్చును. గృహము, సంఘము, దేహము బంధములు కావు. ప్రతిబంధక ములు కానే కావు. కావున సన్న్యాసమను పేర భార్యాపిల్లలను విసర్జించుట, వృత్తి వ్యాపారములను వదలివేయుట, సంఘమున వేరుపడి వెలిగ నుండమని భగవంతుడు చెప్పలేదు. "మనసా సన్న్యస్య" అని పలుకుటలో, మనసున సన్న్యసించిన చాలునని, భౌతిక సన్న్యాసము అవసరము కాదని తెలిపినాడు. తా నట్లే ఆచరించి చూపినాడు. రాజర్షులు, మహర్షులుకూడ నట్లే ఆచరించి రని తెలిపినాడు. సంసారమధ్యమున కూడ సన్న్యాసిగ నుండవచ్చు నని తెలిపినాడు. "సన్న్యాసులందు కూడ చాలమంది సంసారులే" అని అనుచు అప్పుడప్పుడు మాస్టర్ ఇ.కె. గారు పలుకుచుండెడి వారు. మాస్టర్ ఇ.కె. గారు సంసారమందు సన్న్యాసిగ ఎట్లుండ వచ్చునో జీవించి చూపించినారు. సన్న్యాసము మానసికమే అని తెలియవలెను.

# 12

## సన్న్యాసము

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ 14

భగవంతుడు జీవులకు కర్తృత్వము, కర్మములను సృజింప లేదు. కర్తృత్వము, కర్మము, ఫలములందాసక్తి ఆయన స్వభావము నుండి ఏర్పడుచున్నవి.

శ్రద్ధగల వారికే ఈ సున్నితము, సూక్ష్మమగు విషయము అవగాహన కాగలదు. పరతత్త్వము కేవలము ఉండుటగ నుండును. అతని నాధారముగ గొని అనేకానేక విషయములను ప్రకృతి నిర్మించుచున్నది. పరతత్త్వము నుండి పుట్టిన కాలము, ప్రకృతి సృష్టి సమస్తమును అల్లిక చేయుచు నుండును. పరతత్వము నుండి ప్రకృతి శక్తిని గొని త్రిశక్తులుగ మారి కాలక్రమమున జీవుల నుద్భ వింపజేయు చున్నది. జీవులు ప్రకృతి నుండి పుట్టినవారే అయి నప్పటికి వారు వస్తుతహ పరతత్వాంశమే. అందువలన వారికిని ప్రకృతిని దాటు సౌలభ్యమున్నది. వశిష్ఠాది మహర్షులట్టివారు.

ప్రకృతి, త్రిశక్తులే త్రిగుణాత్మకముగ సృష్టిని నిర్మాణము చేయును. సప్తలోకములను త్రిగుణములతో నిర్మించును. అందు జీవులు వసింతురు. రజస్తమస్సులను సమన్వయపరచి, సత్త్వమున సంయమము చెందుట ద్వారా జీవులు కూడ వారి వారి స్వభావ ములను దాటవచ్చును. అట్లు దాటినవారు తమ స్వభావము కన్న వేరుగ తమ అస్తిత్వమును గుర్తింతురు. వారు స్వభావమునకు లోబడరు. కార్యములు తమ స్వభావము నిర్వర్తించుచుండగ ఉదాసీనులై అవలోకింతురు. ఇట్టి వారినే అవలోకితేశ్వరులు అందురు. వారి నుండి కార్యములు జరుగును. వారికి చేయు చున్నామను భ్రమ యుండదు. సర్వము ప్రకృతి సంకల్పమే. ప్రకృతి దివ్యత్వమునుండి వెలువడిన సంకల్పమే అని తెలిసియుండును. తమ తమ స్వభావములు ప్రకృతి స్వభావముతో సమన్వయింప బడి కార్యములు జరుగుచుండగ, తాము వీక్షించుచు నుందురు.

దైవసృష్టి కవిసృష్టి వంటిది. కవి నుండి ఎన్నిరకముల పాత్రలు, సన్నివేశములు, వివిధములగు ఘట్టములు వ్యక్తమగు చున్నను, అందు తానొక పాత్రధారిగ నున్నను తన నుండి వెలు వడిన కథ తనను బద్ధుని చేయదు. హాస్య ఘట్టము, శోక ఘట్టము, విజయ ఘట్టము, పరాజయ ఘట్టములు, లాభనష్ట ఘట్ట ములు యిట్లెన్నియో ఘట్టములు కథ నుండి వెలువడు చున్నప్పుడు ఆ ఘట్టములు ప్రభావము కవిపై నుండవు గదా! అట్లే దైవము కూడ. జీవుడు కూడ నట్లే యుండవచ్చునని, అట్టివారే సన్న్యాసులని దైవము తెలుపుచున్నాడు.

# 13

# తటస్థత

**నాదత్తే కస్యచి త్పాపం నచైవ సుకృతం విభుః ।**
**అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః ॥ 15**

దైవము జీవుల పుణ్యమునుగాని, పాపమునుగాని స్వీకరింపడు. అతడు జ్ఞానముచే తెలియబడువాడు. అట్టి జ్ఞాన మజ్ఞానముచే కప్పబడి యుండుట వలన జీవులు మోహము చెందుచున్నారు.

దైవ తత్త్వము తటస్థముగ నుండును. పాపములు చేసిన వారిని దైవము శిక్షించ నవసరము లేదు. వారి పాపములే వారిని శిక్షించును. అట్లే పుణ్యము చేసినవారిని దైవ మనుగ్రహించుటయు లేదు. వారి పుణ్యములే వారికి సుఖశాంతుల నిచ్చుచున్నవి. ఒకరియం దాగ్రహము, ఒకరియం దనుగ్రహము దైవము చూపడు. దైవము కేవలము తెలుసుకొనదగిన వాడే! తెలుసు కొనినవాడు దైవమువలె తటస్థ స్థితి యందుండును. ఉదాహరణకు ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, పృథ్వి తటస్థమగు స్వభావము గలవారే వానిని వినియోగించుకొను జీవులు

సుఖమును, దుఃఖమును కూడ పొందవచ్చును. అట్లే సూర్యకాంతి కూడను. వినియోగ జ్ఞానము గలవారికి సృష్టి సుఖమీయ గలదు. అట్టి జ్ఞానము లేనివారికి దుఃఖము కలుగవచ్చును. ఇందు భగవత్ ప్రమేయ మేమియు లేదు. 'రామ, రామ, రామ' యనుచు అగ్ని శిఖపై వేలుంచిన కాలక తప్పదు. రాముని స్మరణ వలన జ్ఞానము కలిగినచో అగ్ని శిఖపై వ్రేలుంచరాదని తెలుయుట సరియగు పద్ధతి.

**ఏ జీవునికైనను అతడు చేయు కర్మయే అతనికి ఫలముల నిచ్చుచుండును. అందరును బాగుండవలెనని చేయు పనులు సుఖమీయగలవు. ఇతరులకు దుఃఖము కలిగించు పనులు కాల చక్రమున దుఃఖము నీయగలవు. ఇందు భగవంతుని ప్రమేయ మేమియును లేదు.**

భగవదారాధన లన్నియు పవిత్రము చెందుటకు, జ్ఞానము పొందుటకే అని తెలియవలెను. జ్ఞానము పొందుట యనగ ధర్మ స్వరూపము నెరిగి ఆచరించుట. సృష్టి నిర్మాణము చేయునపుడే దైవము సృష్టియందు ధర్మము నేర్పరచెను. ధర్మము నాచరించు వారు రక్షింపబడుట, ఆచరింపనివారు దుఃఖము చెందుట సృష్టి యందు జరుగుచు నుండును. సనక సనందనాదులు, త్రిమూర్తులు, సప్తఋషులు, మనువులు, ప్రజాపతులు, ఆదిత్యులు, రుద్రులు, వసువులు, గ్రహగోళాదులు, పంచభూత ములు, మానవులు, జంతువులు, వృక్షములు ఎవరెవరి ధర్మము

వారికున్నది. ధర్మము ఎవరు నిర్వర్తింపకున్నను వారికి క్లేశము తప్పదు.

దైవము ద్వంద్వాతీతమైన సృష్టి కతీతము. సృష్టియం దతడు ధర్మముగనే వసించి యున్నాడు. అందువలన ప్రత్యేకముగ అనుగ్రహించుట, ఆగ్రహించుట యుండక సాక్షీభూతుడై యుండును. సన్న్యాస మనగ కూడ యిదియే స్థితి. సన్న్యాసి అయిన వానికి యితరుల పాపపుణ్యములతో సంబంధము లేదు. అతడందరి యందును ఒకే విధముగ సముడై ప్రవర్తించును.

## 14

# నిరహంకారము

**జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః ।**
**తేషా మాదిత్యవద్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥ 16**

జ్ఞానముచేత అజ్ఞానము నాశన మొనర్పబడినపుడు ఆజ్ఞానము ఆదిత్యునివలె పరతత్త్వమును ప్రకాశింపజేయును.

జ్ఞానము అజ్ఞానముచేత ఆవరింపబడి యుండునని, అందుచేత జీవులు భ్రమను చెందుచున్నారని, పరమాత్మ తటస్థుడు, సాక్షీభూతుడని ముందు శ్లోకమున తెలుపబడినది. ఈ శ్లోకమున జ్ఞానమగు వెలుగు కలుగుచున్నకొలది అజ్ఞానమగు చీకటి తొలగుచు నుండునని తెలుపబడినది. జ్ఞానము సూర్యోదయము వంటిది. సూర్యుడు ఉదయించు చున్నకొలది చీకటి తొలగి పోవుచు నుండును. అట్లే జ్ఞానము కలుగుచున్నకొలది చిత్తభ్రమలు, భ్రాంతులు నశించుచుండును. దైవమును గూర్చిన సదవగాహన జ్ఞానముచే తెలియబడినట్లు, అజ్ఞానమున తెలియబడదు. జ్ఞానము కలుగుచున్నకొలది ప్రతి ఒక్కనికి తన స్వరూప స్వభావములు స్పష్టమగు చుండును. క్రమముగ 'తాను' అను అహంకార

పురుషుడు నశించి పరతత్త్వమే ఉన్నదని తెలియును. 'ఆదిత్యవత్' అను శ్లోకమును వాడుటలో ఒక సూక్ష్మమున్నది. ఆదిత్యుడు సవిత్రు మండలమునకు, సూర్య మండలమునకు వెలుగును ప్రసాదించు వాడు. అట్టి ఆదిత్యుడు కూడ స్వయం ప్రకాశకుడు కాదు. అతని నుండి వెలుగునది పరతత్త్వమే.

'నేను' అను అంతర్యామి తత్త్వము 'నేను' అను అహంకార పురుషుని ద్వారా ప్రకాశించును. విద్యుద్దీపము ఎంత ప్రకాశించు చున్నను, ఆ ప్రకాశమునకు మూలము కనబడని విద్యుత్తే కదా! ప్రకాశించు దీపమే గోచరించును గాని, విద్యుత్తు గోచరించదు. అట్లే కనబడుచున్న వెలుగునకు కనబడని వెలుగాధారము. నిజముగ జ్ఞానము కలిగినవాడు తా నున్నానను భ్రమను చెందడు. దైవమే తానుగ నున్నాడని తెలిసియుండును. నిజముగ దైవమే యున్నాడని తెలిసియుండును.

ముందు అధ్యాయములలో దైవము "నేను సూర్యున కుపదేశించితిని. సూర్యుడు మనువున కుపదేశించెను. మనువు ఇక్ష్వాకున కుపదేశించెను" అని యొక రహస్యము తెలిపినాడు. అనగా 'నేను' అను అంతర్యామియగు వాసుదేవుడు, నే నను అహంకార పురుషుడగు సంకర్షణుని యందు ప్రకాశించును. అటుపైన ఆ నేనే బుద్ధియగు ప్రద్యుమ్నుని నుండి, చిత్తమగు అనిరుద్ధుని నుండి కూడ ప్రకాశించుచున్నది. ఇంద్రియములు (చిత్తము), మనసు, బుద్ధి, అహంకారము వీటినుండి ప్రకాశించు నది ఒకే వెలుగు. అది తన యందు పరిసరముల యందు

వ్యాపించి యుండును. ఇట్లు తెలిసినవానికి తాను, యితరులు అను బేధముండదు. అంతయు పరతత్త్వమే నిండి యుండునని పరమానందభరితుడై యుండును. ఇట్లు తెలిసినవారే ఆదిత్యుని వలె పరబ్రహ్మ స్వరూపమునకు వాహికలై యుందురు. వారే సద్గురువులు. నిరహంకారులు. పూర్ణ జ్ఞానులు.

# 15

## అపునరావృత్తి

**దద్బుద్ధయ స్తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణా ।**
**గచ్ఛంత్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూత కల్మషాః ॥** 17

సర్వమునకు ఆధారమైన తత్త్వము నందు తమ బుద్ధిని నిలుపువారు, 'నేను' అను అహంకారమును, 'నేను' అను సర్వాంత ర్యామి ప్రజ్ఞయందు స్థిరముగ నిలుపువారు ఆ తత్త్వము నందే నిష్ఠగలవారు, అదియే తానైన వారు. పునరావృత్తిలేని స్థితిని పొందు చున్నారు. జ్ఞాన మనగ ఆ తత్త్వముతో ముడిపడుటయే అట్టి వారిని పాపము లంటవు.

ఉన్నది యొకటే. దానినే సత్యమందురు. ఉండుట సృష్టి యందు అన్ని స్థితుల యందు ఉన్నది. సృష్టికి పూర్వము కూడ నున్నది. అందుండే కాలము, ప్రకృతి, శక్తి, త్రిగుణములు, పంచ భూతములు పుట్టుచున్నవి. త్రిగుణముల నుండియే సర్వజీవ రాశులు పుట్టుచున్నవి. అన్నిటి యందు ఉండుటగ ఆ పరతత్త్వ మున్నది. అదియే సత్యము. రాయి రప్ప కూడ ఉండుట యను స్థితియందున్నది. అన్నిటియందున్నను, అన్నిటికి అతీతముగ

నుండునది, అన్నిటికి ఆధారమై యుండునది ఈ తత్త్వము. దీనినే పరమాత్మయని, అంతర్యామియని సంబోధింతురు. నిజమునకు అందరికిని, అన్నిటికిని అదే మూలము. దానితో ముడిపడి యుండుట నిజమగు జ్ఞానము, నిజమగు భక్తి, నిజమగు యోగము, నిజమగు సన్న్యాసము, వైరాగ్యము.

బుద్ధి చేతను, స్మరణ చేతను, నిష్ఠ చేతను దానియందు స్థిరపడినవారు శాశ్వతులు. అట్టివారిని త్రిగుణాత్మకమగు ప్రకృతి ఆరోహణ, అవరోహణ క్రమములకు గురిచేయదు. సనక సనంద నాదులు, వశిష్ఠ అగస్త్యులు అట్టివారు. తత్త్వముతో ముడిపడిన వారిని ప్రకృతి గుణములు స్పృశించవు గనుక, పాపపుణ్యములు పునర్జన్మలు వారి కుండవు. వీరు సహజ జ్ఞానులు. వారి స్థితి సహజ సమాధి స్థితి.

## 16

# సమదర్శనము

**విద్యా వినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।**
**శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥** 18

విద్య, వినయ సంపన్నులైన బ్రాహ్మణుల యందు, గోవుల యందు, ఏనుగు నందును, కుక్క యందును, కుక్క మాంసము తిను చండాలుని యందును సమదర్శనము చేయువారే జ్ఞానులు.

అన్నిటియందు ఉన్నది ఒక్కటియే. ఉన్నది సత్యము అని ముందు తెలిపితిమి. ఉన్నదాని చుట్టును ప్రకృతి తన గుణముల చేత, పంచభూతములచేత వివిధములగు అల్లికలు చేయుచు నుండును. ఈ అల్లికలలో వైవిధ్యమున్నది. విద్య, వినయము సంపదగా గలిగిన బ్రాహ్మణులకు మూలముగ ఏది యున్నదో అదియే చండాలుని యందు, కుక్క యందు, ఏనుగు నందు దర్శించుట సమదర్శనము.

సామాన్యముగ మనసు, బుద్ధి ఆధారముగ జీవించు మానవులు యితరుల స్వభావమునే దర్శింతురుగాని, స్వభావము

నకు మూలమున నున్న తత్త్వమును దర్శింపలేరు. అన్నిటియందు వసించి యున్నటువంటి తత్త్వమునే దర్శించుచు, స్వభావము ప్రకృతియొక్క విలాసముగ దర్శించువారు నిజమగు జ్ఞానులు, సన్న్యాసులు. మంచి స్వభావము కలవారు, చెడ్డ స్వభావము కల వారు, ప్రాణము కలవి, ప్రాణము లేనివి అన్నిటి యందు ఉన్న దొక్కటే. త్రిగుణముల కలయికలు వేరగుటచేత అవి వేరు వేరు స్వభావములతో గోచరించును. స్వభావములను చూచువారు మాయను బడక తప్పదు. ఉన్నదానిని చూచు వారిని ప్రకృతి బంధింపదు.

ఉన్నది చూచుట జ్ఞానము, సమదర్శనము. అట్లు చూచు వారే పండితులు. అనగా తెలిసినవారు. ఇతరములను చూచువారు శ్రీకృష్ణుని దృష్టిలో పండితులు కారు. అట్టివారు కేవలము చదివిన వారే కాని తెలిసినవారు కారని మాస్టర్ ఇ.కె. తెలుపుచునుండిరి. అధికులని, అధములని భేదములు సృష్టిలో నుండుట ప్రకృతి అమరిక. తదతీతమైన సత్యమున యివి ఏవియును లేవు.

ప్రపంచమున ప్రవర్తించినపుడు పేడ-బెల్లము కలుపు కొనుట, గుఱ్ఱమును-గాడిదను సమానమని భావించుట, గంగి గోవును-దున్నపోతును సమానముగ భావించుట, సంస్కారులు-కుసంస్కారులు సమానమేనని భావించుట అజ్ఞానము. అది సమదృష్టి కాదు. సమదృష్టి యనగ వైవిధ్యమునకు మూలము ఒక్కటే యని తెలియుట. అంతియే కాని స్వభావముల యందు సమానత్వము నాపాదించుట కాదు. స్వభావపరముగ ఆరోహణ,

అవరోహణ క్రమములున్నవి. మూలమున కవి వర్తింపవు. సంఘమున బాధ్యత గలవారు, బాధ్యత లేనివారు యిరువురు సమానమా? స్వభావపరముగ వారు సమానము కాదు. కాని వారియందు మూలముగ నున్నది ఒక్కటియే. ఇట్లేకత్వమును గమనించుచు, వైవిధ్యమును మన్నించుచు సాగవలెను. ఏకత్వము స్థిరపడినపుడు అన్నింటి యందును ప్రేమ యుండును. అంత మాత్రము చేత వైవిధ్యమును మరువరాదు. శిశుపాలుడు, అర్జునుడు తత్త్వమున ఒకటియే. స్వభావమున చాల వ్యత్యాస మున్నది. అర్జునుని శ్రీకృష్ణుడు ప్రేమతో రక్షించెను. శిశుపాలుని ప్రేమతోనే శిక్షించెను. అట్లే రాముని ప్రవర్తనమునందు కూడ తత్త్వమును ప్రేమించుట, స్వభావమును బట్టి ప్రతిస్పందించుట గోచరించును. హనుమంతుని, సుగ్రీవుని, రావణుని, విభీషణుని కూడ రాముడు ప్రేమించినాడు. వారి వారి స్వభావములను బట్టి ప్రతిస్పందించినాడు. పులిని, పిల్లిని తత్త్వపరముగ ప్రేమించుట, స్వభావపరముగ తగు విధముగ ప్రతిస్పందించుట ఈ శ్లోకమున తెలుపబడినదే కాని, అన్నము-సున్నము కలుపుకొనుట కాదని తెలియవలెను.

ఉండుటను సత్య మందురు. ప్రకృతి స్వభావమును చైతన్యమందురు. చైతన్యమునకే స్థితి భేదము. ఉండుటకు స్థితి భేదము లేదు. చైతన్యమునకు నిద్రావస్థ, స్వప్నావస్థ, మానసికావస్థ, బుద్ధి యిత్యాది అవస్థలు. ఎక్కువ చైతన్యము, తక్కువ చైతన్యము గల జీవులుందురు. దీనిని బట్టే స్థావరములు, జంగమములు,

ప్రాణము లేని, ప్రాణము ఉన్న జీవులు, భూమి జీవులు, దేవతలు. దేవతలలో కూడ, పితృదేవతలు, వసువులు, రుద్రులు, ఆదిత్యులు ఏర్పడి యున్నారు. సృష్టి యందు ఏడు లోకములు, ఏడు రకముల చైతన్యముతో కూడిన జీవులున్నారు. ఇవి యన్నియు చైతన్యావస్థలు. అజ్ఞానుల నుండి, జ్ఞానుల వరకు అనేక అవస్థ లలో మానవు లున్నారు. ఇది యంతయు ప్రకృతి విలాసము. దానికాధారముగ నున్న పురుషుడు మాత్రము అన్నిటి యందు ఒకే స్థితి గొని యున్నాడు. పురుషుని దర్శించుట సమ దర్శనము కలవారికే వీలగును. వారు ప్రకృతి విలాసమున అంతర్గతుడై స్థితి చెందిన దైవమును కూడ చూతురు.

# 17

## సమభావము

**ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।**
**నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మా ద్బ్రహ్మణి తే స్థితాః॥ 19**

సమభావము, స్థిరత్వము ఎవరి మనసునకు కలదో వారి కిచ్చటనే సర్గము జయింపబడి, దోషరహితము సమము అయిన బ్రహ్మమునందు స్థితిగొన్న వారగుదురు.

సర్గమును మనసుచే జయించుటవలన బ్రహ్మమునందు స్థిరపడుట తెలుపబడినది. సర్గమనగా సృష్టిసర్గము. అది భూర్భువసువరాది ఏడులోకములుగ ఏర్పడి యున్నది. ఇవన్నియు చైతన్యస్థితులు. భౌతిక స్థితి, ప్రాణమయ స్థితి, మనోమయ స్థితి, బుద్ధి స్థితి, ఆకాశ స్థితి (మహత్), తపో స్థితి, సత్య స్థితి యిట్లేడు లోకములు వర్ణింపబడినవి. ఇందు ప్రాథమిక స్థితులలో పదార్థ మెక్కువగను, ప్రజ్ఞ తక్కువగ నుండును. అట్లే ఉన్నత స్థితులలో ప్రజ్ఞ ఎక్కువగను, పదార్థము తక్కువగ నుండును. ప్రజ్ఞ ఎక్కువగ నున్న లోకములను వెలుగు లోకము లందురు. మానవుడు తన యందలి చైతన్యము యొక్క విలాసము వలన వెలుగు లోకము

లందు, పదార్థమయ లోకములందు చరించుచు నుండును. ఈ హెచ్చు తగ్గులన్నియు చైతన్యము యొక్క క్రీడయని భావించి, దానికి మూలమైన సత్యమున ప్రవేశించుటకు మనసునకు సామ్యము, స్థిరము అవసరము.

వెండితెరపై రంగులు, శబ్దములతో కూడిన సినిమా కథ నడచుచుండగ రసవత్తరముగ నుండును. కాని దాని కాధారమైన తెరకు సినిమా సన్నివేశము లన్నియు పట్టవు. తెరమీద కథను గమనించువారు కథలో లీనమగుదురు. తెరను కూడ గమనించు వారు సమస్తమగు సన్నివేశములు వచ్చిపోవునవిగ గమనింతురు. జీవితమందలి సంఘటనలు అనేకానేకములు వచ్చిపోవుచున్నను, తాను తెరవలె యున్నాడు అని తెలిసినవాడు, వచ్చిపోవు సన్నివేశ ములకు ప్రభావితుడు కాడు. అట్లు ప్రకృతి విలాసములను గమ నించుచు వాని కాధారమైన బ్రహ్మమునందు స్థితి గొన్నచో ఈ శరీరమునందే బ్రహ్మత్వము పొందవచ్చునని భగవంతుడు తెలుపుచున్నాడు.

మనసున బ్రహ్మమును గూర్చిన భావనము స్థిరపడుచున్న కొలది మనసునకు స్థిరత్వము, సామ్యము కుదురును. అట్టి మనసుతో సర్గమును (చైతన్య విలాసమును) జయించవచ్చును. అపుడిచ్చటే బ్రహ్మమునందు స్థితిగొని యుండవచ్చును. అదియే సామ్యము. సర్గమున కతీతమగు స్థితి. సర్గము ప్రకృతి యధీనము. సామ్యమున ప్రకృతికూడ యధీనమై యుండును. అదియే బ్రహ్మము నందు స్థితిగొనుట యందురు.

# 18

## బ్రహ్మజ్ఞాని

**న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య నోద్విజే త్ప్రాప్య చాప్రియమ్।**
**స్థిరబుద్ధి రసమ్మూఢో బ్రహ్మవిద్ బ్రహ్మణి స్థితః ॥ 20**

బ్రహ్మమునందు స్థిరబుద్ధికల బ్రహ్మజ్ఞాని మోహరహితుడై యుండును. ఇష్టమైన దానిని పొందునపుడు సంతోషించుటగాని, యిష్టము లేని దానిని పొందునపుడు దుఃఖించుట గాని చేయడు.

బ్రహ్మజ్ఞాని అన్నిటియందు బ్రహ్మమునే దర్శించును. అతని బుద్ధి బ్రహ్మమునందు స్థిరపడి యుండును. అతడు బ్రహ్మ పరాయణుడై యుండునని, బ్రహ్మమునందే నిష్ఠ కలిగి యుండు నని, అన్నింటియందును బ్రహ్మమునే దర్శించునని, సృష్టి సర్గమును దాటిన దృష్టి కలవాడని ముందు శ్లోకములలో తెలుప బడినది. బ్రహ్మమును దర్శించునపుడు ప్రకృతి విలాసమే యుండును కాని, మాయ ఆవరింపదు. మోహము పొందుట యుండదు. అతడు అసమ్మూఢుడు. మూఢత్వమనిన మోహ పడుట. ప్రకృతి మాయ లేని వానికి మూఢత్వము లేదు, మోహ

నత్వము లేదు. మోహమే లేనపుడు ప్రియము లేదు, అప్రియము లేదు. ఇది బ్రహ్మజ్ఞాని లక్షణము.

ఇటీవలి కాలమున రామకృష్ణ పరమహంస జీవితము బ్రహ్మజ్ఞానికి దర్పణము పట్టినట్లుండును. సమకాలిక బ్రహ్మ జ్ఞానులు కూడ అతనిని చూచి విస్తుపోయిరి. రామకృష్ణుడు సదా బ్రహ్మమునందే చరించెను. తానే బ్రహ్మము అయి ఉండుట వలన, తాను బ్రహ్మజ్ఞాని యను స్ఫురణ కూడ తనకు లేదు. బ్రహ్మజ్ఞాను లందరును సభ నేర్పాటు చేసి అతనిని బ్రహ్మజ్ఞానిగ నిర్ణయించినారు. ఆ విషయము పరమహంసకు తెలుపగ ఆ మహాత్ముడు "అంటే ఏమిటి" అని అడిగినాడట. అతడు మురుగు నీటిని కూడ ఆచమనము గావించెడివాడు. శునకముతో సమాన ముగ కలిసి భుజించెడివాడు. శునక మను భావ మతనికుండక, అదియును బ్రహ్మముగనే గోచరించెడిది.

బ్రహ్మజ్ఞాన స్థితి ప్రకృతి స్పర్శ దాటిన స్థితి.

## 19

# బ్రహ్మము

**బాహ్యస్పర్శే ష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్ ।**
**స బ్రహ్మ యోగయుక్తాత్మా సుఖ మక్షయ మశ్నుతే ॥ 21**

బ్రహ్మముతో యోగము చెంది ముక్తుడైనటువంటి జీవాత్మ అక్షయమగు సుఖమును పొందుచున్నాడు. అతనికి బాహ్యస్పర్శ యిత్యాది యింద్రియ స్పర్శ లుండవు. వానియం దాసక్తియు యుండదు.

బ్రహ్మము ప్రకృతికి కూడ అతీతమైన తత్త్వము. దాని యందు ముడిపడిన స్థిర చైతన్యము కలవాడు ప్రకృతి సంబంధిత సుఖములను దాటిన వాడగుచున్నాడు. అతనికి దేహ సంబంధిత మగు సుఖములుగాని, యింద్రియపరమగు సుఖములుగాని, మనోభావములుగాని, అహంకార భావములుగాని యుండవు. అంతయు దైవముగనే యుండును. అందువలన బాహ్యస్పర్శ యందు ఆసక్తిని దాటిన వాడని వేరుగ చెప్పవలెనా!

## 20

# స్థిర చైతన్యము

**యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।**
**ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః ॥ 22**

ఇంద్రియ సుఖములు, యింద్రియ భోగములు మొదలు సుఖము కలిగించినను, తరువాత దుఃఖము కలిగించగలవు. అవి అంతవంతములని తెలిసి బ్రహ్మజ్ఞాని వానియందు రమించడు.

త్రిగుణాత్మకమగు ప్రకృతి సహజ లక్షణము మార్పు. అష్ట ప్రకృతులు ఎప్పుడును మార్పు చెందుచునే యుండును. మూల ప్రకృతి మార్పు చెందకయుండు వెలుగు. అది తొమ్మిదవది. ఆ స్థిరమగు వెలుగున కాధారము దాని కావలయున్న బ్రహ్మతత్త్వము. ఈ తత్త్వము నాశ్రయించినపుడు మనయందలి చైతన్యమను వెలుగు స్థిరముగ నుండును. స్థిరచైతన్యము ఆనంద దాయకము. అది పూర్ణము కూడ. అష్ట ప్రకృతులలోని చైతన్యము మార్పుకు నిరంతరము గురియగు చుండును. పంచేంద్రియములు, రజస్త మస్త్వములు సన్నివేశములను బట్టి, కాలమును బట్టి, దేశమును బట్టి వివిధముగ అనుభవము కలిగించును. అవి సుఖము

కలిగించునట్లుగ అనిపించునుగాని, ఆ సుఖమును అందీ అంద నట్లు అనుభవింప చేయుచుండును. తిథులకు గురియైన చంద్రుడు ఎట్లు హాని వృద్ధులను అనుభవించునో, మానవుడు కూడ అట్లే ద్వంద్వము లందు ఊగిసలాడు చుండును. ప్రకృతి విలాసమును దాటి, స్థిరముగ నుండి ప్రకృతి క్రీడను చూచుట మహదానంద దాయకము.

నదీ ప్రవాహమున కొట్టుకొని పోవుచున్నవాడు నదీ గమన మును గాని, పరిసరములగల ప్రకృతి రమ్యతనుగాని అనుభూతి చెందలేడు. స్థిరము, పటిష్ఠము అయిన నావయందు సుఖాసీనుడై, నదిపై పయనించు ప్రయాణికుడు ప్రవాహము యొక్క వేగమును, తీరమునందలి రమ్యమగు దృశ్యములను చూచి ఆనందించ గలడు. అట్లే సృష్టి రమ్యతను శాశ్వతముగ అనుభూతి చెందుటకు సృష్టి కధిష్ఠానమైన తత్త్వమున స్థిరపడుట తెలివి. ఇట్టి తెలివి బ్రహ్మజ్ఞానికి మాత్రమే యుండును.

# 21

## స్మరణ

**శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్ శరీర విమోక్షణాత్ ।**
**కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥** 23

కామ క్రోధముల వేగమును ఏ మానవుడైతే ఈ శరీరము విడచుటకు పూర్వమే జయించ సమర్థుడగు చున్నాడో, అట్టి మానవుడు యోగియై సుఖవంతుడగు చున్నాడు.

కామక్రోధము లన్నవి ప్రపంచమున జీవించు మానవునకు సన్నివేశమునుబట్టి, పరిస్థితులనుబట్టి ఉద్భవించుచునే యుండును. ఇవి చిత్తవృత్తులు. వీనిని అరికట్టుటయే యోగము. అరికట్టుట యనగ బలవంతముగ త్రొక్కిపెట్టుట కాదు. త్రొక్కి పెట్టినచో, అవి సమయమునకై వేచియుండి విజృంభించగలవు. చిత్తవృత్తి నిరోధమునకు యోగవిద్యయే పరిష్కారము. యోగ మనగా ఆసనములు, ప్రాణాయామములే కాదు. దైవమునందు ప్రీతియే నిజమగు యోగము. అట్టి ప్రీతి మధురాతి మధురముగ నుండుటచేత యితర విషయములందు ప్రీతి శిథిల మగుచు నుండును.

శ్లోకము చదివినపుడు ‘‘కామ క్రోధముల వేగమును జయించి, యోగమున సుఖపడుము’’ అన్నట్లు గోచరించును. ఇది సాధ్యపడునది కాదు. యోగమున స్థిరపడి, కామక్రోధములను జయించమనుట యిందలి రహస్యము. చీకటని పారద్రోలి, వెలుగు నేర్పరచుకొనుము అని తెలిపినచో అది సాధ్యపడునది కాదు. వెలుగు నేర్పరచినంతనే చీకటి అదృశ్యమగును.

‘యుక్తః’ అను పదము యిందు చాల ముఖ్యము. భగవంతునితో యుక్తుడైయుండుట ప్రధానము. అనగ భగవత్త్వ ముతో ముడిపడి యుండుట. అట్లు ముడిపడుటకు చేయు ప్రయత్నమే స్మరణ, భావన. భగవంతునియందు ప్రీతి యున్నచో, స్మరణ భావన నిరంతర మగుచుండును. అట్టి స్మరణ దీపపు వెలుగువంటిది. స్మరణ యను వెలుగు ఉన్నంత సమయము కామక్రోధములను చీకటి క్రమ్మదు. అట్టి నరునకు సుఖ ముండును. అంతియేగాని కామమును జయింతును, క్రోధమును జయింతును అని అహంకరించువారు శ్రమ చెందుచు దుఃఖ పడుదురు. ఇచ్చట సమర్థత భగవంతునితో యుక్తము చెందు టయేగాని, కామక్రోధములను జయించుట కాదు. కామక్రోధ ములు కూడ పై విధముగ శరీరమందుండగనే జయించనిచో మరుజన్మమున గూడ దుఃఖముండును. అందువలన భగవంతుడు ఈ శరీరమందున్నప్పుడే నాతో యోగము చెంది, కామక్రోధములను హరించి, శాశ్వతముగ సుఖపడుము’’ అని తెలుపుచున్నాడు.

## 22

# బ్రహ్మ నిర్వాణము

**యోఽంతఃసుఖో ఽంతరారామ స్తథాంతర్జ్యోతి రేవ యః ।**
**స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి ॥ 24**

యోగి అంతర్ముఖుడై అంతరంగము నందలి వెలుగుతో రమించుచు, అంతఃసుఖమును పొందుచు, ఆత్మజ్యోతియై ప్రకాశించుచు నుండును. అతడు బ్రహ్మ స్వరూపుడై బ్రహ్మము నందు నిర్వాణము చెందుచున్నాడు.

అంతరంగమున బ్రహ్మము వసించి యున్నది. అది ఆధారముగ చైతన్యము, చైతన్యము ఆధారముగ త్రిగుణములు (త్రిశక్తులు), వాని నాధారము చేసుకొని పంచభూతములు ఏర్పడి యున్నవి. ఇట్లు పది అంశములతో కూడిన స్థూల సూక్ష్మములగు ఏడు పొరలతో ఏర్పడిన రూపమున జీవుడున్నాడు. అందువలననే అతడు దశరథుడు అని, సప్తపర్ణి అని సంబోధింపబడుచున్నాడు. ఈ మొత్తమునకు మూలము బ్రహ్మమే గదా! అట్టి బ్రహ్మమునందు యుక్తము చెందుట యోగమగును. తొమ్మిది ఆవరణలు దాటి పదియవ అంశమగు బ్రహ్మముతో భావపరమగు యోగము

చెందుట ప్రధానము. అపుడు చైతన్యము పరిపూర్ణమై వెలుగును. గుణములు, పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచేంద్రియ ములు, పంచాంగములు అట్టి చైతన్యమునకు లోబడి యుండును. పై విధముగ భావన చెందినపుడు అంతరంగమున తన జ్యోతిస్వరూపము గోచరించును. ఆ స్వరూపమునకు మూల మైన తత్త్వము అందలి సూక్ష్మ స్పందన బిందువుగ గోచరించును. అదియే పరమాత్మ స్థానము. దానియందు రమించుచున్న యోగికి, బుద్ధి మనో యింద్రియముల కతీతముగ సుఖము లభించు చుండును. ఆ బిందు స్థానమున లగ్నమైన చైతన్యము కలవా డగుటచే అచ్చటి బ్రహ్మము యొక్క సాన్నిధ్యమును పొందును. క్రమముగ బ్రహ్మమే యగును. తానుండక బ్రహ్మ ముండును. తాను బ్రహ్మమునందు నిర్వాణము చెందును. ఇట్లు యోగి అంతర్ముఖుడై బ్రహ్మ సాయుజ్యమును పొందగలడు.

23

# మోక్ష స్థితి

**లభంతే బ్రహ్మనిర్వాణ మృషయః క్షీణకల్మషాః ।**
**ఛిన్న ద్వైధా యతాత్మానః సర్వభూతహితే రతాః ॥ 25**

ఋషులు బ్రహ్మ నిర్వాణము అనుగ్రహముగ పొందినవారు. వారు చరించు బ్రహ్మములే. బ్రహ్మ నిర్వాణము పొందినవారికి కల్మషములు శాశ్వతముగ నశించి యుండును. మనోబుద్ధి యింద్రియములు యమింపబడి యుండును. వారు భూమిపై చరించుటకు కారణము సర్వభూతములకు హితము కలిగించుటకే.

బ్రహ్మమును ధ్యానించి సాలోక్య, సామీప్య, సాయుజ్య, సారూప్య సోపాన మార్గమున బ్రహ్మమైన వారు వశిష్ఠాది బ్రహ్మర్షులు. బ్రహ్మర్షు లనగ స్ఫురించువారు అత్రి, భృగువు, అంగీరసుడు, వశిష్ఠుడు, అగస్త్యుడు, గౌతముడు ఆదిగా గల ఋషులు. వీరి యందు వెదకి చూచినను కల్మష ముండదు. వారు కాలమును, దేశమును, దైవమును ఎరిగిన వారు. వారికి సంశయము లుండవు. వారు సమస్తమును బ్రహ్మముగనే దర్శింతురు. ద్వంద్వములగు మంచి చెడులు వారిపై ప్రభావము

చూపవు. వారికంతయు బ్రహ్మమే. అట్టివారు శరీరధారులై భూమిపై చరించుటకు ముఖ్యమగు కారణ మొకటియే సర్వభూతములకు హితము కలుగజేయుటకు వారు అమితాసక్తులై యుందురు. కోరినవారికి హితము చేయుటయే పనిగ అహోరాత్రములు ఉన్ముఖులై యుందురు. పరులకు హితము చేయుట పరమాత్మకు చేయు ఆరాధనగ వారు భావించుచుందురు.

బ్రహ్మ నిర్వాణము చెందుట, బ్రహ్మ సాయుజ్యము పొందుట, బ్రహ్మమగుట ఊరకయుండుటకు కాదు. మోక్షమనగ ఏ బంధములు లేక, ఏ పనిలేక ఎక్కడో ఒక అద్భుతమగు లోకమున హాయిగ నుండుట అని సామాన్యు లందరు భావింతురు. కల్మష ములు లేనిచోట బంధము లేదు. సంశయము లేనిచోట చిక్కు పడుటయు ఉండదు. బ్రహ్మమునందు మనసు నిలచుట చేత శరీరము, యింద్రియములు, మనసు వశమున నుండును. అహంకార భావము నశించి యుండును. చిత్తవృత్తులందు తనదైన స్వభావము చిందులాడక దైవీ స్వభావమే మిగులును. అట్టి స్థితి యందు పరహిత మనునది పరమ ధర్మముగ నిర్వర్తింప బడును. అదియే మోక్ష స్థితి. శరీరము వదలిన వెనుక వచ్చునది మోక్షమని భావించుట అజ్ఞానము.

## 24

# ఆత్మ నెరిగిన వారు

**కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।**
**అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥** 26

బ్రహ్మ నిర్వాణమును పొందినవారు విదితాత్ములై వర్తింతురు. వారు యత చేతస్సులు. యతులు. కామక్రోధముల నుండి విడి వడినవారు.

బ్రహ్మ నిర్వాణ మనగ బ్రహ్మమునందు కరగిన అహంకార స్థితి. మంచుగడ్డ నీటియందు తేలుచున్నపుడు అది వేరుగ గోచరించును. నీటికన్న విలక్షణమైన లక్షణములు కలిగి యుండును. ఎవరి ముఖమున నైనను నీరు చల్లినచో చల్లగ యుండును గాని, బాధింపదు. మంచుగడ్డతో కొట్టినచో బాధ కలుగును. అహంకార స్థితి మంచుగడ్డవంటి స్థితి. నీటి స్థితి బ్రహ్మము లేక ఆత్మ స్థితి. అహంకారమునకు మూలమైన తత్త్వమే బ్రహ్మతత్త్వము. అది త్రిగుణములకు లోబడినపుడు ప్రత్యే గాత్మయై తానొకడ నున్నాడని భావన చెందును. నిజమునకు తన రూపమున నున్నది పరతత్త్వమే. బ్రహ్మతత్త్వమే. ఆ తత్త్వమే

తానుగ నున్నాడు. తత్త్వమే తానుగ నున్నాడని తెలియుట, తత్త్వము నుపాసించుట, తాను కరిగి తత్త్వము మిగులుట జరిగినచో అది బ్రహ్మ నిర్వాణ మగును.

బ్రహ్మ నిర్వాణ స్థితిని పొందినవారి బుద్ధి నుండి, మనసు నుండి, యింద్రియముల నుండి, వాక్కు నుండి, చేతల నుండి బ్రహ్మ తత్త్వమే ప్రకాశించును. అనగ బ్రహ్మమే అన్ని పొరల నుండి విదితమగు చుండును. వారి మాట, చేత, నడవడికల నుండి బ్రహ్మమే ప్రకాశించుచుండును. ఇట్టి వారిని విదితాత్ము లందురు. విదితాత్ము లనగ ఆత్మ నెరిగిన వారని అర్థము. ఆత్మ తత్త్వమే సర్వత్ర విదితము గావించువారని మరియొక అర్థము. ఇట్టివారి వర్తనమున చూపరులకు ఆత్మ తత్త్వము విదితమగు చుండును. ఇదియంతయు 17వ శ్లోకమున చెప్పబడిన రీతిగ, బ్రహ్మ పరాయణులై యుండుట వలన ఏర్పడు స్థితి.

ఎవరి బుద్ధి, మనసు, యింద్రియములు, వాక్కు, చేష్టల నుండి ఆత్మ తత్త్వము విదిత మగుచుండునో అట్టివాని చేతన యమింపబడి యుండును. అనగా చైతన్య స్వరూపిణియగు శ్రీమాత తన మాయను ప్రసరింపజేయక, అనుకూలవతియై యుండును. చేతన తత్త్వమునకు అనుకూలముగ నుండుటవలన సర్వము యమింపబడినవారై యుందురు. అట్టివారిని యతులు అందురు. యతీంద్రు లందరు నిరంతరము తత్త్వమునే ప్రకాశింప జేయుదురు. అట్టివారిని కామ క్రోధములు దరిచేరలేవు. స్పృశించనైన స్పృశించలేవు. వారు కామక్రోధ వియుక్తులు అని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

25

# అంతర్ముఖుడు

**స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాం శ్చక్షుశ్చై వాంతరే భ్రువో ।**
**ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ ॥ 27**

బాహ్యమందలి స్పర్శాది విషయములను వెలుపలనే వదిలి ప్రాణాపానములను సమానము గావించి, చూపును అంతర్ముఖముగ నాసికాగ్రమున నిలిపి ముక్తుడై యుండుట తెలుపబడినది.

శబ్ద స్పర్శాది విషయము లన్నియు బాహ్య ప్రపంచ సంబంధితము. పంచేంద్రియముల మూలమున మానవుడు వీని ననుభవించు చున్నాడు. ఇంద్రియ సుఖము లన్నియు బాహ్య సుఖములే. పంచేంద్రియములే లేనిచో జీవునకు బాహ్యస్మృతి యుండదు. ఇంద్రియముల అమరిక సృష్టిలో ఒక ప్రధాన ఘట్టము. ఇంద్రియముల అమరిక సృష్టింపక మునుపు జీవుడు అంతర్ముఖుడై, అంతరంగముననే యుండెడివాడు. ప్రచేతసులు అను ప్రజ్ఞల రూపమున యింద్రియ ప్రజ్ఞల నేర్పరచి, అంతః చేతనను బహిరంగముగ ప్రకటితము గావించుట జరిగినది. ఇంద్రియముల ద్వారా బాహ్యమున కలవాటుపడిన జీవులు,

బాహ్యోన్ముఖులై అంతరంగమందలి స్వస్థానమును మరచిరి. ఇల్లు మరచి రాత్రింబవళ్లు పోకిరిగా తిరుగు పిల్లలను సంఘమున చూచుచున్నాము కదా! వారికి యిల్లు పట్టదు. అట్లే సర్వ సామాన్య ముగ మానవులకు బహిరంగముననే జీవిత మంతయు గడిచి పోవును. అంతరంగ అనుభూతి వారికి కలిగించుటయే ప్రధానోద్దేశ్య ముగ యోగవిద్య ఏర్పడినది.

మానవుని ప్రజ్ఞ అంతర్ముఖ మగుటకు ప్రధానమగు ఉపాయము శ్వాసను గమనించుట, శ్వాసపై మనసు లగ్నము చేయుట. శ్వాసమార్గము బహిర్ముఖమైన మనోప్రజ్ఞను అంతర్ము ఖము చేయుటకు ఉపయోగపడును. శ్వాసపై మనసు నిలుపుట వలన శ్వాస ననుసరించుచు మనసు శ్వాస పుట్టుక స్థానమునకు పయనించును. క్రమముగ మనసు స్పందన ప్రక్రియను చేరును. మనసు స్పందనమును గమనించుట యందు ఏకాగ్రత కలిగిన కొద్దీ, ప్రాణాపానములు సమన్వయింపబడి ఉదాన ప్రాణము ద్వారమున అంతరంగమున ఊర్ధ్వ ముఖమై జనును. భ్రూమధ్య మును చేరును. భ్రూమధ్యమును నాసికాగ్ర కేంద్రముగ కూడ తెలుపుదురు. అచ్చట అంతర్ముఖుడై చరించుచుండును. (ప్రాణాయామ యజ్ఞముగ దీనినే భగవంతుడు ముందు అధ్యాయ ములలో బోధించినాడు.)

అచ్చట అంతర్జ్యోతిని దర్శించుచు, అంతరారాముడై, అంతః సుఖమును పొందుచు నుండువాడు సన్న్యాసియని 24వ శ్లోకమున తెలుపబడినది. అట్లు అంతర్ముఖముగ భ్రూమధ్యమునకు చేరుటకు ఉపాయమును దైవమీ శ్లోకమున ప్రతిపాదించినాడు.

# 26

# మననము

**యతేంద్రియ మనోబుద్ధి ర్మని ర్మోక్షపరాయణః ।**
**విగతేచ్ఛాభయక్రోధో యస్సదా ముక్త ఏవ సః ॥ 28**

మోక్షపరాయణులు యింద్రియ మనో బుద్ధులను నియమ ముతో బ్రహ్మమున సమర్పణ చేయుదురు. ఇచ్ఛ, భయము, క్రోధముల నుండి వారు విగతులై, పై తెలిపిన సమర్పణ భావనచే ఎల్లప్పుడును మోక్షస్థితి యందుందురు.

భగవానుడు సులువగు మార్గములను బోధించు చుండును. ఆ బోధనలు సహితము మానవులు తలక్రిందులు చేసుకొని త్రిప్పలు పడుచుందురు. ఈ శ్లోకమును సామాన్యముగ ఈ క్రింది విధముగ భావింతురు.

ఇష్టము, భయము, క్రోధము అనువానిని విడచి నిగ్రహ ముతో యింద్రియములను, మనసును, బుద్ధిని అధిగమించి మోక్షపరాయణులు ఎల్లప్పుడును ముక్తస్థితి యందుందురు.

పై విధముగ భావించి కోరిక లుండరాదని, భయపడరాదని,

కోపము కలుగరాదని తెలుపుచుందురు. జన్మల తరబడి సాధన జరిపినను ఈ మూడును వదలవు.

వదల్చుకొనదలచిన విషయములు ఎప్పుడును వదలవు. పొందవలసిన సద్విషయములు పొందుటకు ప్రయత్నము చేయవలెను గాని మరియొక మార్గము లేదు. సద్గుణములను దైవపరముగ ఆరాధించుచు, కాలము దానియందు వినియోగించు కొలది, యితర గుణములు దూరము కాగలవు. చీట్లపేక ఆడు వ్యక్తి భగవద్భజన, బోధన, స్తోత్రపారాయణ, సత్కర్మాచరణములలో సమయము వినియోగించు చున్నచో క్రమముగ చీట్లపేకాడుట తగ్గును. ఏమి చేయవలెనో చెప్పవలెనుగాని, ఏమి చేయరాదో చెప్పుట వలన ఉపయోగము లేదు. వాహనమునందు ప్రయాణము చేయుచున్న పిల్లవానికి, చేతులు బయట పెట్టకు అని చెప్పినట్లుండును.

భగవానుడు "మనసా, వాచ, కర్మణా నన్నే ఆశ్రయింపుము" అని పలుమార్లు తెలుపుచు నుండును. బ్రహ్మము నాశ్రయించిన వానికి బ్రహ్మమే మిగులును. దైవమును ఆశ్రయించిన వారికి దైవమే మిగులును. దైవసాన్నిధ్యమున నున్నపుడు దైవమునే కోరుట యుండును గాని, యితరములను కోరుట యుండదు గదా! దైవభావన యున్నచోట భయ భావన ఎట్లు కలుగ గలదు? క్రోధమెట్లు కలుగ గలదు? దైవ స్మరణయందు మనసు, బుద్ధి లగ్నమైన వానికి యిచ్ఛా భయ క్రోధము లుండుట కవకాశమే లేదు. మననమున దైవమును స్థిరపరచుకొని బుద్ధి, మనసు,

యింద్రియములను కూడ అట్టి దైవ మననమున నింపిన మునులకు నిత్యముండు స్థితి ముక్త స్థితి. అట్టి వారిని యిచ్ఛా భయ క్రోధములు స్పృశింపనైనా స్పృశింప లేవు.

ఈ అధ్యాయమున ఆరవ శ్లోకముననే మననము ద్వారా బ్రహ్మముతో యోగయుక్తుడై యుండుట తెలుపబడినది. వారే మునులు. వారి యింద్రియములు, మనసు, బుద్ధి, నిరంతర మననము కారణముగ యమము చెంది యుండును. అట్టి మననము కారణముగ భయక్రోధాది భావము లుండవు. ప్రహ్లాదుడు, అంబరీషుడు అట్టివారు.

# 27

# సాన్నిధ్యము

**భోక్తారం యజ్ఞతపసాం సర్వలోక మహేశ్వరమ్ ।**
**సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతి మృచ్ఛతి॥ 29**

తపస్సు, యజ్ఞముల భోక్తను నేను. సర్వలోకముల అధిపతులకు ఈశ్వరుడను నేను. సృష్టి యందు పుట్టిన సమస్త ప్రాణులకు సుహృదయుడను నేను. ఈ విధముగ నన్ను తెలుసు కొనిన వాడు శాశ్వతముగ శాంతిని పొందుచున్నాడు.

సన్న్యాస స్థితికి చరమ గీతముగ భగవంతుడు ఈ వాక్యమును పలికినాడు. "నేను" అను అంతర్యామి ప్రజ్ఞగ అందరి హృదయములందు తా నున్నాడు. అట్టివాని చూచుట ప్రధానము. అతడే సమస్తమునకు స్వామి. అతడే గమ్యము. అట్టి వానిని 'నేను'గ తనయందు, సర్వభూతముల యందు దర్శించుచు దేశమును, కాలమును బట్టి సంచరించువాడు సన్న్యాసి యని, అట్టి సన్న్యాసి శాంతియే ప్రధాన లక్షణముగ యుండునని తెలియ వలెను.

ఈ అధ్యాయమునకు "కర్మ సన్న్యాసయోగము" అని నామ కరణము చేయుటలో గల ఔచిత్య మేమనగ, సత్సాధకుడు తన మనో బుద్ధి యింద్రియములను 'నేను' అను అంతర్యామి ప్రజ్ఞ యందు లగ్నము చేసియుండగ, అతని సమస్త కార్యములు యాంత్రికముగ సాగిపోవును. చేయుచున్నట్లనిపించదు. దీనికి భక్తుల జీవితమున చాల ఉదాహరణలు గలవు.

**1. గోపికలు** : గోపికల మనసు అహర్నిశలు శ్రీకృష్ణుని యందే లగ్నమై యుండగ, వారి దైనందిన జీవితమంతయు అనాయాస ముగ సాగిపోయినది. అన్నిటియందు వారు కృష్ణుని దర్శించుటచే కృష్ణదర్శన మాధుర్యము గూడ నిరంతర ముండెడిది.

2. సక్కుబాయి : ఈమెకు మానవ సాధ్యము కాని బరువు బాధ్యతలు అప్పచెప్పబడినను, కృష్ణ సాన్నిధ్యమున నుండుటచే, అసాధ్యము లన్నియు సుసాధ్యములైనవి. దుష్కరమైన కార్యములు కూడ తాను చేసితినను భావనయే లేక ఫలించినవి.

3. హనుమంతుని సముద్రోల్లంఘనము, నారదుని వీణా గానము కూడ ఈ కోవకు చెందినవే.

(మనసు కర్మల యందు లగ్నము కాక, దైవమునందు లగ్నమగుటచే కర్మలు అప్రయత్నముగను, అనాయాసముగను సాగునని తెలుపుట 'కర్మ సన్న్యాసయోగ' రహస్యము.)

# OTHER BOOKS THROUGH
## MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

**BOOKS :**

| | | |
|---|---|---|
| 1. | MITHILA –A New Age Syllabus | E/G/S |
| 2. | THE AQUARIAN MASTER | E/G/S |
| 3. | SOUND –The Key & its Application | E/G/S |
| 4. | ASHRAM LEAVES | E/G/S |
| 5. | SANKHYA –The Sacred Doctrine | E/G/S |
| 6. | VENUS –The Path to Immortality | E/G/S |
| 7. | THEOSOPHICAL MOVEMENT | E/G/S |
| 8. | SHIRDI SAI SAYINGS | E/G/S |
| 9. | SPIRITUALITY IN DAILY LIFE | S |
| 10. | THE MASTERS OF WISDOM | S |
| 11. | MEDITATION & GAYATRI | S |
| 12. | WISDOM TEACHINGS OF VIDURA | E/G/S |
| 13. | ON HEALING | E/G/S |
| 14. | SPIRITUAL FUSION OF EAST & WEST | E |
| 15. | SRI SASTRY GARU | E/G/S/F/T |
| 16. | THE AQUARIAN CROSS | E/G/S |
| 17. | HERCULES –The Man & the Symbol | E/G/S |
| 18. | MANTRAMS –Their Significance & Practice | E/G/S |
| 19. | SRI DATTATREYA | E/G/S/T/HI |
| 20. | SATURN –The Path to Systematised Growth | E/S |
| 21. | JUPITER –The Path of Expansion | E/S |
| 22. | MASTER E.K. –The New Age Teacher | E/G/S |

| | | |
|---|---|---|
| 23. | AMANASAKUDU | T/K |
| 24. | VRUTRASURA RAHASYAM | T |
| 25. | THE DOCTRINE OF ETHICS | E |
| 26. | DHANAKAMUNI KATHA | T |
| 27. | ANTARDARSANA DHYANAMULU | T |
| 28. | THE SPLENDOR OF SEVEN HILLS | E/T/Hi |
| 29. | DOCTRINE OF ETERNAL PRESENCE | E |
| 30. | ASANGUDU | T |
| 31. | SARASWATHI - THE WORD | E |
| 32. | MANA MASTARU GARU | T |
| 33. | GEETOPANISHAD (Sankhya Yogamu) | T |
| 34. | GEETOPANISHAD (Karma Yogamu) | T |
| 35. | GEETOPANISHAD (Jnana Yogamu) | T |
| 36. | ‘OM’KARAM | T |
| 37. | JYOTIRLINGA YATRA | T |
| 38. | SRI LALITHA | T |
| 39. | KATHA DEEPIKA | T |
| 40. | MASTER C.V.V. (Birthday Message) | T |
| 41. | MAITREYA MAHARSHI BODHALU | T |
| 42. | MARUVU MAHARSHI BODHALU | T |
| 43. | DEVAPI MAHARSHI BODHALU | T |
| 44. | HIMALAYA GURU PARAMPARA | T |
| 45. | OCCULT MEDITATIONS | E |
| 46. | RUDRA | E |
| 47. | Master C.V.V. - The Initiator - Master E.K. The Inspirer | E |
| 48. | SAI SUKTHULU | T |
| 49. | SRI KRISHNA NAMAMRUTAM | T |
| 50. | On LOVE | E |
| 51. | On SILENCE | E |
| 52. | On CHANGE | E |
| 53. | Sri GURUPADUKASTAVAM | T |
| 54. | SRI LALITHA - 2 | T |

**BOOKLETS :**

| | | |
|---|---|---|
| 1. | LORD MAITREYA -The World Teacher | E/G/S/F |
| 2. | THE WHITE LOTUS | E/G/S |
| 3. | WISDOM BUDS | E/G/S |
| 4. | SPIRITUALISM, BUSINESS & MANAGEMENT | E/G/S |
| 5. | THE PATH OF SYNTHESIS | E |
| 6. | THE ETHERIC BODY | E/G/S |
| 7. | MARIA MAGDALENA | E/G/S |
| 8. | TIME, THE KEY | E/G/S |
| 9. | LISTENING TO THE INVISIBLE MASTER | E/G/S/F/H |
| 10. | GOOD FRIDAY | E/G/S/F/H |
| 11. | BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU | T/K |
| 12. | MARRIAGE - A SACRAMENT | E |
| 13. | MASTER C.V.V. YOGAMU-KARMARAHITYAMU | T |
| 14. | POOJA VIDHANA PRASASTYAMU | T |
| 15. | GAYATRI MANTRA PRASASTYAMU | T |
| 16. | BHARATEEYA SAMPRADAYAMU | T |
| 17. | SRI DATTATREYA | T |

**ధనిష్ఠ ఇతర ప్రచురణలు :**

1. శ్రీ వినాయక వ్రతకల్పము
2. శ్రీ శరన్నవరాత్ర పూజావిధానము
3. శ్రీ హనుమాన్ చాలీసా
4. శ్రీ సూర్య పూజావిధానము
5. శ్రీ శివ హృదయము
6. శ్రీ మహాలక్ష్మి పూజావిధానము
7. శ్రీ వేంకటేశ్వర పూజావిధానము
8. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము
9. పురాణపురుషుని పూజా విధానము
10. శ్రీ దత్తాత్రేయ పూజా విధానము